ప్రజాశక్తి

గురువారం 18 సెప్టెంబర్ 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు



జిజిహెచ్‌లో అతిసార బాధితులు

డయేరియా!

- జిజిహెచ్‌కి భారీగా రోగులు
- 17 ప్రాంతాల నుండి 35 చేరిక
- ప్రైవేటు ఆస్పత్రులకు మరింతమంది

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో డయేరియా విజృంభిస్తోంది. క్రమంగా కేసులు పెరుగుతున్నాయి. అతిసార లక్షణాలతో గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)కు బుధవారం 17 ప్రాంతాలకు చెందిన 35 మంది వచ్చి చేరారు. గుంటూరులోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు పెద్ద ఎత్తున ప్రభుత్వ ఆస్పత్రికి రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. నివేదికివ్వాలని అధికారులను జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. వర్షాలు ఎక్కువగా కురుస్తుండటంతో ఆహార పానియాలు కలుషితమై పలువురు వాంతులు, విరోచనాలతో ఆస్పత్రి బాటపట్టారు. వందలాది మంది ప్రైవేటు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. జిజిహెచ్‌కు బుధవారం రాత్రి పొద్దుపోయే వరకు బాధితులు వస్తూనే ఉన్నారు. పాత గుంటూరు, రెడ్ల బజార్, బుచ్చయ్యతోట, హనుమయ్య నగర్, తారకరామ నగర్, భాగ్యనగర్, లేవ్‌స్టేషన్, శ్రీనగర్, దొంకా రోడ్, సంపత్ నగర్, రామిరెడ్డిపేట, ఆర్‌టిసి కాలనీ, మంగళదాస్ నగర్, నల్లచెరువు, ఒబుల నాయుడుపాలెం, తెనాలి, తాడేపల్లి తదితర ప్రాంతాల నుంచి ఎక్కువ కేసులు వస్తున్నాయి. అతిసార రోగులకు ప్రత్యేకంగా ఒక వార్డు ఏర్పాటు చేసి చికిత్సలు అందిస్తున్నామని జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ తెలిపారు. భారీ వర్షాలు, వరదల వల్ల తాగు నీటిలో బురద శాతం అధికంగా ఉందని అధికారులు ఆలస్యంగా గుర్తించారు. ఈ కేసులు వెలుగుచూసిన తరువాత నీటిని కాచి చల్లార్చి తాగాలని కార్పొరేషన్ అధికారులు ప్రకటించారు.

అధికారులు అప్రత్తంగా ఉండాలి : కలెక్టర్

అతిసార కేసులకు మంచి వైద్యం అందించాలని వైద్య అధికారులను కలెక్టర్ ఆదేశించారు. బుధవారం గుంటూరు నగరంలో వివిధ ప్రాంతాల నుండి నమోదైన అతిసార కేసులపై నగర పాలక సంస్థ కమిషనర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, జిల్లా సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్‌లు తక్షణం నివేదిక సమర్పించాలని ఆదేశించారు. కొత్తగా కేసులు నమోదు కాకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రజలు భయాందోళనలకు గురికాకుండా అవగాహన కల్పించాలని, ఆసుపత్రుల్లో ఉన్నవారికి మంచి వైద్య సేవలు అందించాలని చెప్పారు. అన్ని ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు. నగర పాలక సంస్థ కమిషనర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, జిల్లా సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్‌లతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అర్బన్ హెల్త్ సెంటర్లపరిధిలో వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేయాలని, అధికారులు నిత్యం పర్యవేక్షించాలని చెప్పారు. మునిసిపల్ కార్పొరేషన్ సురక్షితమైన నీటిని సరఫరా చేయాలన్నారు.



మహిళల ఆరోగ్య పరిరక్షణకు కృషి

స్వస్త్ నారి సశక్త్ పరియార్ అభియాన్ ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మహిళల ఆరోగ్య పరిరక్షనకు ప్రభుత్వం కృషి చేస్తుందని కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. స్వస్త్ నారి సశక్త్ పరియార్ అభియాన్ కార్యక్రమాన్ని గుంటూరు వైద్య కళాశాలలో బుధవారం ఆయన ప్రారంభించారు. వచ్చేనెల 2వ తేదీ వరకు కొనసాగే ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో సబ్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆసుపత్రుల్లో వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం కింద జిల్లాలో ఇప్పటి వరకు 8.60 లక్షల మంది నమోదయ్యారని, నూరుశాతం నమోదవ్వాలని కోరారు. ఒక్కొ మహిళకు ఏడాదికి రూ.ఐదారు వేలు పౌష్టికాహారం కోసం ఖర్చు చేస్తున్నామని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం బాగుంటే సమాజ ఆరోగ్యం బాగుంటుందన్నారు. జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా మాట్లాడుతూ స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలు, బాలికలకు రక్త హీనత, క్షయ, సికిల్ సెల్ అనీమియా గుర్తింపు పరీక్షలు, బిపి, మధుమేహం, క్యాన్సర్ వంటి పరీక్షలు కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పిల్లలకు టీకాలు వేస్తామన్నారు. ప్రధాన మంత్రి వందన యోజనలో ప్రత్యేక నమోదు చేపడుతున్నామని చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని, ప్రదర్శన శాలలను మంత్రి, అధికారులు సందర్శించారు. కార్యక్రమంలో ఎపిఎంఎస్ఐడిసి మేనేజింగ్ డైరెక్టర్ గిరీషా, జెడ్‌పి చైర్‌పర్సన్ హెనీక్రిస్టినా, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ వి.హరిబాబు నాయుడు, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి, తులసి సీడ్స్ అధినేత రామచంద్రప్రభు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి విజయలక్ష్మి, జిజిహెచ్ సూపరింటెండెంట్ ఎస్.ఎస్.వి.రమణ పాల్గొన్నారు.



ముసాయిదా చట్టానికి సవరణల పత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

కౌలు రైతులకు చట్టమే ఆటంకం

- 2019 చట్టాన్ని సవరించాలి
- కౌల్దార్లకు భరోసా ఉంటేనే వ్యవసాయానికి భవిష్యత్

ప్రజాశక్తి-గుంటూరు

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వటానికి గత ప్రభుత్వం తెచ్చిన చట్టమే రైతులకు ఆటంకంగా ఉందని రైతు సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు అన్నారు. దరఖాస్తు ఫారంలో భూ యజమాని సంతకం ఉండాలనే నిబంధన వల్ల గుర్తింపు కార్డు దక్కట్లేదన్నారు. 2019 కౌలు రైతు చట్టాన్ని సవరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక రామన్నపేటలోని జనచైతన్యవేదిక హాల్లో ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం బుధవారం నిర్వహించారు. గత ఎన్నికల్లో టిడిపి ఇచ్చిన హామీ ప్రకారం రానున్న అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రస్తుత కౌల్దార్ల చట్టాన్ని సవరించి, భూ యజమానితో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు, రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తీర్మానాన్ని సమావేశంలో ఆమోదించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రైతుసంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు మాట్లాడుతూ 2011 కౌల్దార్ల చట్టాన్ని సవరించి, గత ప్రభుత్వం 2019లో తెచ్చిన చట్టంతో కౌలు రైతులకు గుర్తింపుకార్డులు దక్కటమే గగనమైందన్నారు. ఈ చట్టాన్ని సవరిస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేసిన టిడిపి గెలిచాక సవరణ ముసాయిదాపై ప్రాంతీయ సదస్సులు ఏర్పాటు చేసి, ఇప్పుడు ఆ విషయాన్ని

▶ 2లో

నక్సలైట్లు, టెర్రరిస్టులు ఒకటికాదు

సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

ప్రజాశక్తి-గుంటూరు

నక్సలైట్ల కంటే టెర్రరిస్టులే మేలని మోడీ అనటాన్ని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ తీవ్రంగా ఖండించారు. స్థానిక కొత్తపేటలోని సిపిఐ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. టెర్రరిస్టులు వేరు.. నక్సలైట్లు వేరని, టెర్రరిస్టులకు ఫిలాసఫీ అంటూ ఉండదని.. కేవలం చంపడం తప్ప ఈ సమాజం పట్ల వారికి ఎలాంటి అవగాహనా ఉండదని అన్నారు. కానీ నక్సలైట్లు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో స్పష్టమైన వైఖరి కలిగి ఉండి, అంతర్జాతీయ సిద్ధాంతాన్ని ఆయుధంగా చేసుకొని పని చేస్తారని చెప్పారు. తమదీ అదే సిద్ధాంతమే అయినా వారికి, తమకు వ్యవత్యాసం ఉందన్నారు. నక్సలైట్లను చంపినంత మాత్రాన వారి సిద్ధాంతాన్ని చంపలేరని, నక్సలిజాన్ని చంపడం ఎవరి తరమూ కాదని హెచ్చరించారు. నక్సలైట్ల సాకుతో గిరిజనులను చంపుతున్నారని ధ్వజమెత్తారు. గిరిజనులు అడవిని ఖాళీ చేసి పోతే ప్రకృతి సిద్ధమైన వనరుల్ని కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పటానికి కేంద్ర కుట్రలు చేస్తోందని విమర్శించారు. నేర చరిత్ర కలిగిన అమిత్ షా అసలు

▶ 2లో



సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఏచూరి స్ఫూర్తితో సామ్రాజ్యవాదంపై పోరాటం

ప్రథమ వర్ధంతి సభలో నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు

మతోన్మాదానికి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సీతారాం ఏచూరి స్ఫూర్తితో పోరాడాలని మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక బ్రాడీపేటలో సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ నిర్వహించారు. జిల్లా కార్యదర్శి వై.నేతాజి అధ్యక్షతన మంగళవారం రాత్రి జరిగింది. లక్ష్మణరావు మాట్లాడుతూ మతోన్మాదంపై, సామ్రాజ్యవాదంపై చివరి శ్వాస వరకూ ఏచూరి పోరాడారన్నారు. ప్రపంచంలో పెట్టుబడిదారీ సమాజం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, సామ్రాజ్యవాదానికి పెద్దన్నగా ఉన్న అమెరికా వివిధ దేశాలపై పెంచుతున్న సుంకాలే అందుకు నిదర్శనమని చెప్పారు. భారతదేశంపై 50 శాతం సుంకాల ఫలితంగా ఆక్వా, జిన్నింగ్ పరిశ్రమలు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయన్నారు. మరోవైపు చైనాపై విధించిన సుంకాలకు ఆదేశం ధీటుగా సమాధానం ఇవ్వడంతో అమెరికా వెనక్కి తగ్గిందని, మోడీ మాత్రం నోరు మెదపట్లేదని అన్నారు. దక్షిణ ఆసియాలోని పాకిస్తాన్, నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక దేశాల్లో సంక్షోభం నెలకొందని, ఇవన్నీ గతంలో ఐఎంఎఫ్ నుండి రుణాలు పొందాయని గుర్తు చేశారు. ఫలింగా ఆయా దేశాల్లో అవినీతి, నిరుద్యోగం పెరిగిందని, ప్రజల్లో వ్యతిరేకంగా పెల్లుబికిందన్నారు. మన దేశంలోనూ పాలకులు ఆవే విధానాలు అనుసరిస్తున్నారన్నారు. ఇజ్రాయిల్ దాడి వల్ల గాజాలో 2023

▶ 2లో



నాగార్జునసాగర్ ప్రాజెక్టులో 16 క్రస్ట్ గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

కొనసాగుతున్న సాగర్ నీటి విడుదల

ప్రజాశక్తి - విజయపురిసౌత్

నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరదనీరు చేరిక కొనసాగుతోంది. దీంతో సాగర్‌లో బుధవారం 16 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. 16 క్రస్ట్ గేట్లు 5 అడుగుల మేర ఎత్తి 1,26,240 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 1,59,207 క్యూసెక్కులు వచ్చి చేరటంతో ఇక్కడ నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 1,79,861 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ఇక్కడ నుంచి కుడికాలువకు 9,500, ఎడమకాలువకు 8,545, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 33,048, ఎస్ఎల్బీసీకి 2,400, వరద కాలువకు 300 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం సాగర్ జలాశయ నీటిమట్టం 588.00 అడుగులు కాగా ఇది 306.1010 టీఎంసీలకు సమానం.

పులిచింతలకు 1,61,918 క్యూసెక్కుల నీరు విడుదల

ప్రజాశక్తి- రెంటచింతల

మండలంలోని సత్రశాల వద్ద కృష్ణా నదిపై నిర్మించిన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు నుంచి పులిచింతలకు 1,60,918 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ వెంకటరమణ తెలిపారు. 20క్రస్ట్ గేట్లగాను 9 గేట్లను మూడు మీటర్లు ఒక గేటు 2.5 మీటర్ల మీద ఎత్తి 1,53,978 క్యూసెక్కులు విద్యుత్ ఉత్పత్తి అనంతరం రెండు యూ నిట్లు ద్వారా 7940 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు మంగళవారం అర్ధరాత్రి 12 గంటల వరకు 0.9 873 ఎంయుల విద్యుత్ ఉత్పత్తి తయారైంది అన్నారు. రిజర్వాయర్లో 7.026 టీఎంసీలు నీరు ఉందన్నారు ఎగువన ఉన్న నాగార్జునసాగర్ నుంచి 1,59,789 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు.



డ్రైన్లపై ఆక్రమణల తొలగింపును పరిశీలిస్తున్న కమిషనర్

డ్రెయిన్లపై ఆక్రమణలు తొలగించాలి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో డ్రైన్లు ఆక్రమించి, చేపట్టిన నిర్మాణాలను యుద్ద ప్రాతిపదికన తొలగించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పట్టణ ప్రణాళిక అధికారులకు స్పష్టం చేశారు. బుధవారం జిజిహెచ్ దగ్గరలోని సెయింట్ జోసఫ్ స్కూల్లో వర్షపునీరు నిలిచిందని అందిన ఫిర్యాదు మేరకు కమిషనర్ సదరు స్కూల్‌ని పరిశీలించి, స్కూల్ ఎదుట డ్రైన్‌పై ఆక్రమణలను తొలగింపచేశారు. డ్రైన్ల ఆక్రమణ వల్ల వర్షపు నీరు ఇళ్లలోకి వస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించుకోవాలన్నారు పర్యటనలో పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



కరాటేలో 'కృష్ణవేణి' విద్యార్థినికి పతకం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

తమ కళాశాల డిగ్రీ చదువుతున్న వి రమ్య కరాటేలో సిల్వర్ మెడల్ సాధించిందని కృష్ణవేణి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. ఈ నెల 7 న దాచేపల్లిలో జరిగిన కరాటే ఇన్నోవేషనల్ - 2025 పోటీలలో ఉత్తమ ప్రతిభతో సిల్వర్ మెడల్ సాధించిందన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభ రమ్యను అభినందించారు. కళాశాల క్యాంపస్ ఇంచార్జ్ సర్దార్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు అభినందించారు.

ఏచూరి స్ఫూర్తితో సామ్రాజ్యవాదంపై పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

అక్టోబర్ నుండి 63వేల మంది చనిపోయారని, అమెరికా ప్రోద్బల్బంతోనే ఇజ్రాయిల్ దాడులకు తెగబడుతోందని చెప్పారు. దేశంలో స్వతంత్ర్యంగా వ్యవహరించాల్సిన కేంద్ర ఎన్నికల సంఘం కేంద్రప్రభుత్వ ఏజెంటుగా మారిందని, ఇటీవల బీహార్ ఎన్నికల్లో అసంబద్ధమైన కారణాలతో 66 లక్షల ఓట్ల తొలగింపుతోనే ఈ విషయం స్పష్టమైందని విమర్శించారు. గవర్నర్ల ద్వారా బిజెపి యేతర రాష్ట్రాల్లోని ప్రభుత్వాలను కేంద్ర ఇబ్బందులకు గురి చేస్తోందని, గవర్నర్లు బిల్లులు నిలుపుదలపై సుప్రీం కోర్టు తీర్పు చారిత్రాత్మకమైందని అన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వానికి ప్రజాస్వామ్యంపై, రాజ్యాంగంపై గౌరవం లేదని, సమాఖ్య విధానానికి తూట్లు పొడుస్తోందని విమర్శించారు. విభజన హామీలు అమలు చేయకుండా ఏపీ ప్రజల గుండెల్లో గునపాలు దించిన బిజెపి, ప్రజల గుండెల్లో ఉందని నడ్డా చెప్పటం హాస్యాస్పదంగా ఉందన్నారు. విశాఖ ఉక్కును నిర్వీర్యం చేస్తున్నారని, పోలవరం నిర్వాసితులకు, రాజధానికి, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు ఇవ్వట్లేదన్నారు. అటువంటి పార్టీని రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు భుజాన మోస్తూ ప్రజల్ని మోసం చేస్తున్నాయని విమర్శించారు. దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోందన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న అకలి, నిరుద్యోగం, పేద ధనిక తారతమ్యాలకు, ఏచూరి మార్క్సిస్టు దృక్కోణంలో నిర్దిష్టమైన పరిష్కారాలు చూపారని, ఆ క్రమంలోనే రాజ్యసభ సభ్యుడిగా ప్రజా సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించారని చెప్పారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.భావన్నారాయణ, ఇ.అప్పారావు, కె.నళినీకాంత్ పాల్గొన్నారు.

కౌలు రైతులకు చట్టమే ఆటంకం

(మొదటి పేజీ తరువాయి)

పక్కన పెడేశారన్నారు. భూ యజమానితో సంబంధం లేకుండా గ్రామసభల్లో కౌల్దార్లను గుర్తించి, బ్యాంకుల్లో పంట రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ కౌలు రైతుల సమస్య నేడు దేశంలో చాలా పెద్ద సమస్య అని, వీరి సంక్షేమాన్ని పట్టించుకోకపోతే అశాంతి, అలజడి పెరుగుతుందని అన్నారు. కౌల్దార్లలో ఎక్కువ మంది ఎస్సీ, ఎస్టీ, బిసిలేనని తెలిపారు. దేశభక్తి అంటే కౌలు రైతులకు సాయం చేయటమేనన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ కౌలుదారులే నిజమైన సాగుదారులని, వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పంటలకు మద్దతు ధర కల్పించాలన్నారు. ఇటీవల మామిడి, టామాట, ఉల్లి రైతుల ధరలు లేక రూపాయి, రెండు రూపాయలకు అమ్ముకుంటున్నారన్నారు. లోన్లు, సబ్సిడీలు, గిట్టుబాటు ధరలు కల్పించి, భరోసా కల్పించాలని కోరారు. ప్రొఫెసర్ ఎన్.వేణుగోపాలరావు మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం రైతులంటే భూమి సాగుచేసే వారని, వారికి భూమిపై హక్కు ఉండాలని అన్నారు. 20 ఏళ్లుగా ప్రభుత్వాలు కౌలు రైతుల గురించి పట్టించుకోకపోవటం అన్యాయన్నారు. డిబిఎఫ్ వ్యవస్థాపకులు కొరివి వినయ్‌కుమార్ మాట్లాడుతూ వ్యసాయం చేసే వారి చేతుల్లోనే భూమి ఉండాలన్నారు. కిసాన్ ఫౌండేషన్ నాయకులు సూరయచంద్ర మాట్లాడుతూ సీజన్‌లో కౌల్దార్ల కంటే ముందుగానే భూయజమానే బ్యాంకులో రుణం తీసుకోవడం వల్ల కౌలురైతులకు బ్యాంకులు రుణం ఇవ్వట్లేదన్నారు. కేరళ రాష్ట్రంలోనే కౌలు రైతులకు సంపూర్ణ సహకారం అందుతోందని చెప్పారు. కౌల్దార్ల చట్టాన్ని సవరించాలని, అన్నదాత సుఖీభవ పథకం కౌలు రైతులు అందరికీ వర్తింపచేయాలని కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని రౌండ్‌టేబుల్ సమావేశం ఆమోదించింది. ఇటీవల ప్రభుత్వం తెచ్చిన ముసాయిదాకు పలు సవరణలు చేస్తూ కౌలురైతు సంఘం రూపొందించిన పత్రాన్ని సమావేశంలో ఆవిష్కరించారు. రైతు సంఘం నాయకులు పి.శివాజీ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఇ.అప్పారావు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జె.నవీన్‌ప్రకాష్, ఆప్ నాయకులు దనుంజయరెడ్డి, రైతుసంఘం జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్, అసైన్డ్ రైతుల సంఘం నాయకులు ప్రసాద్, జె.రామారావు, కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.రామకృష్ణ, ఎం.నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

నక్సలైట్లు, టెర్రరిస్టులు ఒకటికాదు

(మొదటి పేజీ తరువాయి)

రాజకీయ నాయకుడే కాదన్నారు. ఆయన ముద్దాయి నుంచి బయటపడేందుకు 12 మందిని చంపించారని ఆరోపించారు. ఛండీఘర్‌లో ఈనెల 21 నుండి 25వ తేదీ వరూ సిపిఐ జాతీయ మహాసభలు జరగనున్నాయని, దేశ, అంతర్జాతీయ రాజకీయాలు ముఖ్యంగా బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు గురించి ఈ సభలో చర్చిస్తామని చెప్పారు. కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. జనాభా దామాషా ప్రకారం మాటా వాటా మాకు దక్కాలని బిసిల వాదన సరైనదేనని చెప్పారు. 2029లో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలన్నారు. దీని కోసం మహాసభ అనంతరం కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.నాగేశ్వరరావు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌లోని 42 భాగాలను ప్రైవేట్ పరం చేయడానికి కేంద్ర ప్రభుత్వం వేగంగా అడుగులేసోందని, స్టీల్ ప్లాంట్‌ను కాపాడటానికి కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి చేయకపోగా మోడీకి భజన చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్, సిపిఐ జిల్లా కార్యదర్శి కె.మాల్యాద్రి ఇతర నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నారాయణ

అసెంబ్లీకి వెళ్లకపోవడం మోసమే

ప్రజాశక్తి- సత్తెనపల్లి

పెళ్లి చేసుకుంటాం గాని కాపురానికి వెళ్లం అనే సామెతలాగా ఏపీ మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, తెలంగాణ మాజీ సిఎం కె.చంద్రశేఖరరావు తీరుందని నారాయణ ఎద్దేవ చేశారు. ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు సత్తెనపల్లికి వచ్చిన ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిచిన వారు అసెంబ్లీకి వెళ్లకుంటే ఓటేసిన ప్రజల్ని మోసం చేయడమేనన్నారు. అసెంబ్లీకి పోరుగాని ప్రభుత్వ పరంగా వచ్చే లబ్ధిని మాత్రం పొందుతున్నారని విమర్శించారు. అసెంబ్లీకి వెళ్లి ప్రజల తరపున మాట్లాడాలని సూచించారు.

ఉచిత ప్రయాణం కోసం మరో 3 వేల బస్సులు

సూపర్‌సిక్స్ విజయోత్సవంలో మంత్రి రవికుమార్

ప్రజాశక్తి - వినుకొండ

సూపర్ సిక్స్ పథకాలు అమలుపై శివశక్తి లీలా - అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'సూపర్ సిక్స్- సూపర్ హిట్' స్త్రీ శక్తి విజయోత్సవ సభ బుధవారం నిర్వహిం చారు. ఫౌండేషన్ చైర్మన్ గోనుగుంట్ల లీలావతి అధ్యక్షతన జరిగిన సభకు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ చీఫ్ విప్, జివి ఆంజనేయులు, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ రాయపాటి శైలజ, మాజీ ఎమ్మెల్యే నన్నపనేని రాజకుమారి హాజరయ్యారు. ఈ సందర్భంగా డ్వాక్రా సంఘాలకు రూ.51.75 కోట్ల రుణ చెక్కులను, రూ.5 కోట్ల స్త్రీ నిధి చెక్కులను అందజేశారు. మంత్రి రవికుమార్ మాట్లాడుతూ కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో ఉచిత బస్సు పథకం ఉన్నా ఏపీలో మాదిరి విజయవంతం కాలేదన్నారు. దీన్ని మరింత సౌకర్యంగా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 3 వేల ఎలక్ట్రికల్ బస్సులను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. వచ్చే ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగ ఉపాధి కల్పన ప్రభుత్వ ధ్యేయమని, ఏడాదిలో 23 వేల ఉద్యోగాలు కల్పించామని చెప్పారు. అనంతరం జీవీ ఆంజనేయులు, రాయపాటి శైలజ, లీలావతి మాట్లాడారు.



తొలిత నరసరావుపేట రోడ్డులోని సాయిబాబా గుడి వద్ద నుండి మహిళలు ర్యాలీ నిర్వహించారు. సభ వద్ద ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని శైలజ ప్రారంభించగా, మంత్రి రవికుమార్ బీపీ పరీక్ష చేయించుకున్నారు. శిబిరంలో క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలతో పాటు 70 రకాల పరీక్షలు నిర్వహించారు. సభలో 15 మంది గర్భిణులకు జీవీ ఆంజనేయులు - లీలావతి దంపతులు సీమంతాలు చేశారు. టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.శ్రీధర్, జిడిసిసిబి చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, జనసేన నాయకులు నాగ శ్రీను రాయల్, బిజెపి నాయకులు ఎం.రమేష్ పాల్గొన్నారు.



హ్యాక్‌థాన్‌లో విజ్ఞాన్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

స్మార్టు ఇండియా హ్యాక్‌థాన్ -2025లో వడ్లమూడి ఫార్మసీ కళాశాల పాల్గొని ఘన విజయం సాధించిందని ప్రిన్సిపల్ పి.శ్రీనివాసబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 39 విద్యార్థుల బృందాలు పాల్గొన్నాయన్నారు. మొత్తం 203 కొత్త సమస్యా ప్రకటనలకు కొత్త పరిష్కారాలను కనుగొన్నారని తెలిపారు. వీరిని జ్యూరీ ప్యానల్ అభినందించిందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త ఆలోచనలతో నివేదికలు సమర్పించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసబాబు, హ్యాక్థన్ కన్వీనర్ ఎన్.శాంతి తదితరులు సన్మానించారు. విద్యార్థులను అభినందించారు.

తురకపాలెం బాధితులకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తురకపాలెం గ్రామాన్ని జిల్లా కాంగ్రెస్ నాయకుల బృందంగా బుధవారం సాయంత్రం సందర్శించింది. ల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిలకా విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఇటీవల గ్రామంలో వేర్వేరు కారణాలతో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. కలుషిత నీటి వల్లే మరణాలు సంభవించినట్టు పలువురు గ్రామస్తులు కాంగ్రెస్ నేతలకు వివరించారు. చిలకా విజయ్ మాట్లాడుతూ ప్రాణాలు కోల్పోయిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే రూ. 50 లక్షల ఆర్థిక సహాయం చేయాలనీ, మరణించిన కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని బాధిత కుటుంబ లో చిన్న పిల్లలు ఉంటే వారికి ఉచిత విద్యను అందివ్వాలన్నారు. ఇంత ఆధునిక ప్రపంచంలో ఒక గ్రామంలో ఇన్ని మరణాలు సంభవిస్తే ఇప్పటి వరకు మరణాలు ఎందుకు జరుగుతున్నాయో ఇప్పటి వరకు తేల్చలేకపోయారన్నారు. తురకపాలెం గ్రామంలో ఇన్ని మరణాలు జరుగుతున్నప్పటికీ కూడా ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటించకపోవడం సిగ్గుచేటు అన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి రావలసిన నష్టపరిహారం అందే వరకు పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి పోరాటం చేస్తారన్నారు. పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు లింగంశెట్టి ఈశ్వరరావు, పార్టీ నాయకులు గడ్డం పాలు విజయకుమార్, కొరివి వినయ్ కుమార్, రాచకొండ జాన్ బాబు బొట్ల బ్రహ్మయ్య, కె వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



తురకపాలెంను సందర్శించిన కాంగ్రెస్ పార్టీ బృందం



విద్యార్థులు రూపొందించిన అవగాహన ప్రదర్శన

ఎన్నారైలో రోగి భద్రతా వారోత్సవాలు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ప్రపంచ రోగి భద్రతా దినోత్సవం సందర్భంగా ఎన్నారై అకాడమీ ఆఫ్ సైన్సెస్‌లో రోగి భద్రతా వారోత్సవాలు బుధవారం నిర్వహించారు. పుట్టిన ప్రతి శిశువు నుండి యుక్త వయసు వరకు సురక్షితమైన సంరక్షణ అందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అడ్మినిస్ట్రేటర్ మండవ విష్ణువర్ధన్ మాట్లాడుతూ హాస్పిటల్‌కు వచ్చే ప్రతి రోగి భద్రత ఎంతో విశిష్టమైనదనీ, రోగి ఆరోగ్యం, సంరక్షణలో భద్రతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని అన్నారు. ఎన్నారై అకాడమీ ఆఫ్ సైన్సెస్ విద్యార్థులు రూపొందించిన అవగాహన ప్రదర్శన కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో డీన్ డాక్టర్ లక్ష్మి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రబోధ్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కుమార్ చౌదరి, క్వాలిటీ కంట్రోల్ విభాగాధిపతి డాక్టర్ కాంతకుమారి, సేఫ్టీ ఆఫీసర్ డాక్టర్ అమిత్ కుమార్, డాక్టర్ ఆరిఫ్ పాల్గొన్నారు.


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

4న నిత్యాన్నదాన దేవాంగ సత్రం ప్రారంభం

ప్రజాశక్తి - మంగళగిరి

తిరుపతి నగరంలో శ్రీ శ్రీనివాస ఉమా రామలింగేశ్వర నిత్య అన్నదాన దేవాంగ సత్రాన్ని అక్టోబర్ 4వ తేదీన ప్రారం భించనున్నట్లు దేవాంగ సత్రం అధ్యక్షులు బొమ్మన దుర్గాప్రసాద్ తెలిపారు. బుధ వారం మంగళగిరి పట్టణంలోని రాయల్ బాంకెట్స్‌లో మంగళగిరి అమరావతి దేవాం గ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బొమ్మన దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శి నక్కిన చిన్న వెంకట్ రాయుడు, ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు బండారు ఆనంద్‌ప్రసాద్, అమరావతి దేవాంగ సంక్షేమ సంఘం మంగళగిరి అధ్యక్షులు బల్ల వెంకట రమణ మాట్లాడుతూ కలియుగ దైవం శ్రీనివాసుని ఆలయం వెలిసిన మహాపుణ్యక్షేత్రం తిరుపతిలో, ఓల్డ్ తిరుచా నూరురోడ్‌లోని శ్రీ అంకాల పరమేశ్వరి దేవ స్థానం పక్కన అద్భుతమైన శ్రీనివాస ఉమా రామలిం గేశ్వర నిత్య అన్నదాన దేవాంగ సత్రం నిర్మాణం సర్వాంగ సుందరంగా జరుగుతోంది. ఎకరాస్థలంలో రూ.45కోట్ల వ్యయంతో మూడు బ్లాకులుగా, ప్రతి బ్లాక్ 6 అంతస్తులుగా భవనం రూపు దిద్దుకుంటోంది. విజయవాడ దేవాంగ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు మెట్ల విఠల్ రావు, మంగళగిరి దేవాంగ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు మొతికి వీర వెంకట సత్యనారాయణ, గౌరవ సలహాదారులు డాక్టర్ కొసనం కోట నాగశ్యామలరావు మాస్టారు హాజరై మాట్లాడారు. సంఘ ప్రతినిధులు అల్లక తాతారావు, అల్లక నమశ్శివాయ, బొమ్మన శ్యాంకుమార్, యుద్ధం అప్పారావు, కనకం రాజారావు, మాన్యం అచ్చయ్య, కొమ్మన శివ, పడాలత ప్రసాద్, మాన్యం రాము, బొమ్మన రవికుమార్, ఆకాశపు మల్లేశ్వరరావు, కటకం చిన సత్యనారాయణ, దోరా రాజారావు, బత్తుల శ్రీను, గోరు తేజేశ్వరరావు పాల్గొన్నారు.


గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తున్న రాజ మోహన్‌రావు

కొల్లా వెంకయ్యకు నివాళులు

ప్రజాశక్తి - పెదనందిపాడు

స్వాతంత్ర్య సమర యోధుడు, కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, శాసనసభ, శాసన మండలి, పార్లమెంటు సభ్యునిగా ప్రజా వాణిని వినిపించిన కొల్లా వెంకయ్య 27వ వర్ధంతి సంద ర్భంగా పెదనందిపాడులో నివాళులు అర్పించారు. డాక్టర్ కొల్లా రాజ మోహన్రావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు-ఆంధ్రులహక్కు ఉద్యమంపై ప్రభుత్వ దమనకాండకు నిరసనగా పార్లమెంటు సభ్యత్వానికి రాజీనామా చేసిన మొదటి పార్లమెంటు సభ్యుడు కొల్లా వెంకయ్య అన్నారు. అణగారిన ప్రజల విముక్తి, పేద ప్రజలకు భూమి, భూసంస్కరణల, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం సభలు, సమావేశాలు, చట్టసభల్లో పోరాటం నుంచి తెలంగాణా, శ్రీకాకుళ రైతాంగ సాయుధ పోరాటాల్లో పాల్గొన్నారు. 1977లో నల్లమడ రైతు సంఘాన్ని స్థాపించి ప్రజలను కదిలించి వరదల నివారణకు మహోద్యమాన్ని నడిపించారని తెలిపారు. పెదనందిపాడు ప్రాంతానికి సాగునీరు, తాగునీరు కృష్ణానది నుండి ఇవ్వాలనిపెదనందిపాడు హైలెవెల్‌ఛానల్‌ను (గుంటూరు ఛానల్‌ను) నిర్మించాలని జీవిత కాలం పోరాడారని అన్నారు.


కొల్లా వెంకయ్యకు నివాళులర్పిస్తున్నసిపిఎం నాయకులు

కార్యక్రమంలో ముందుగా పాత బస్టాండ్ సెంటర్‌లోని కొల్లా వెంకయ్య విగ్రహానికి పూలమాలలు వేసి జోహార్లు తెలిపారు. అనంతరం నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ హేమంతి దేవి, డాక్టర్ అమర్, డాక్టర్ అనిత, యార్లగడ్డ అంకమ్మ చౌదరి, దొప్పలపూడి రమేష్ బాబు, ఆళ్ల సుబ్బారావు, పోపూరి లక్ష్మీనారాయణ, కుర్రా హరిబాబు పాల్గొన్నారు.

విగ్రహం వద్ద సిపిఎం నివాళి

కామ్రేడ్ కొల్లా వెంకయ్య 27వ వర్ధంతి సందర్భంగా పెదనందిపాడు పాత బస్టాండ్ సెంటర్‌లోని వారి విగ్రహం వద్ద సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి, ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పెదనందిపాడు మండల సిపిఎం కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు మాట్లాడుతూ గుంటూరు ఛానల్ పొడిగింపు, నల్లమడ వాగు ఆధునీకరణ పనులు సాధించటమే మనం వెంకయ్యకు ఇచ్చే నివాళి అని తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు జంపని రామారావు, ముద్దన వెంకటేశ్వర్లు, నల్లమోతు రాజేంద్ర, కాపు వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

ఆశా వర్కర్ కుటుంబానికి న్యాయం చేయండి

ప్రజాశక్తి-గుంటూరు

చేబ్రోలు ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో పనిచేస్తూ సెప్టెంబర్ 12న జ్వరంతో చనిపోయిన ఆశ వర్కర్ ఇంటూరి సులోచనకు పరిహారం, ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని ఎపి ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు బుధవారం డిఎంహెచ్‌ఒకు వినతిపత్రం అందజేశారు. పిఎంజెజెబివై పథకం కింద సులోచనకు రూ.2 లక్షలు, ఆమె సర్వీసు ప్రకారం గ్రాట్యుటీ, ఆమె కుమారునికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. అలాగే తెనాలి పిహెచ్ సికి సంబంధించిన బుల్ల శ్రీలత అనే ఆశ వర్కర్ ఈనెల ఆగస్టు 20న డెలివరీ అయినందున జిఒ 94 ప్రకారం ఆమెకు వేతనంతో కూడిన 180 రోజుల మెటర్నిటి సెలవు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు జి.రమణ, ప్రధాన కార్యదర్శి కే.లక్ష్మి, సుజాత, వి.రేణుక, అనురాధ పాల్గొన్నారు.

వేజెండ్ల సొసైటీ నూతన కమిటీ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - చేబ్రోలు

బుధవారం మండలంలోని వేజెండ్ల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం నూతన కమిటీ బుధవారం బాధ్యతలు స్వీకరించింది. చైర్మన్‌గా ఎస్.కె రియాజ్ ఆలీ, డైరెక్టర్లుగా చందు శ్రీరాములు, తోట శివమణికంఠ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తమను సొసైటీ విధుల్లో బాధ్యులుగా చేసినందుకు మాపై ఉన్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని తెలిపారు. రైతుల సంక్షేమం, సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. రైతులకు అన్ని విషయాల్లో ఎలాంటి పక్షపాతం లేకుండా సహకరిస్తామని హామీ ఇచ్చారు. సొసైటీ బలోపేతానికి మండలంలోని రైతులను సమన్వయం చేసి కృషి చేస్తామన్నారు. చైర్మన్ రియాజ్ అలీ మాట్లాడుతూ పంట దిగుబడి, ఉత్పాదకతను మెరుగు పరచ డానికి, బ్యాంక్ ద్వారా వ్యవసాయ ఇన్‌పుట్ సేవలు, రైతులకు అధిక-నాణ్యత విత్త నాలు, ఎరువులు, పురుగు మందులు, యంత్రాలు, నీటి నిర్వహణ వ్యవస్థలు వంటి అవసరమైన ఉత్పత్తులు, వనరులను అందిస్తామని అన్నారు. మండల గ్రామ పార్టీ నాయకులు కార్యకర్తలు వేజెండ్ల సొసైటీ సిబ్బంది నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు.


బాధ్యతలు స్వీకరించిన చైర్మన్ రియాజ్ అలీ, డైరెక్టర్లు



సిఎం పర్యటన ఏర్పాట్లపై పరిశీలన

ప్రజాశక్తి - మాచర్ల : మాచర్ల నియోజకవర్గంలో సిఎం చంద్రబాబు ఈనెల 20న పర్యటించనున్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా సిఎం రానున్న సందర్భంగా ఏర్పాట్లను పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, అడిషనల్ ఎస్పీ సంతోష్, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి బుధవారం పరిశీలించారు. హెలీప్యాడ్, ప్రజా వేదిక, సిఎం మొక్కలు నాటే ప్రదేశం, విద్యార్థులు, పారిశుధ్య కార్మికులతో సిఎం ముఖాముఖి ఏర్పాట్లపై చర్చించారు.



టైల్ పాండ్ ప్రాజెక్టు కార్మికుల నిరసన

ప్రజాశక్తి - రెంటచింతల: సత్రశాలలోని నాగార్జున సాగర్ టైల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు వద్ద కాంట్రాక్ట్ కార్మికులు బుధవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. తెలుగు నాడు విద్యుత్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసనలో నాయకులు మాట్లాడుతూ కార్మికులను సంస్థలో విలీనం చేయాలని, భూములిచ్చిన కార్మికులకు రూ.5 వేలు అలవెన్స్ చెల్లించాలని, 16 నెలల వేతన బకాయిలు, స్కిల్డ్ వేతనాలు, 10 ఏళ్ల సర్వీసు పూర్తి చేసిన వారికి ఇన్సెంటివ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘం అధ్యక్షులు ధర్మారావు, కార్యదర్శి సుగుణరావు పాల్గొన్నారు.

నేడు అంగన్వాడీ యూనియన్ పల్నాడు జిల్లా మహాసభ

ప్రజాశక్తి - సత్తెనపల్లి : పట్టణంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పల్నాడు జిల్లా మహాసభ గురువారం నిర్వహిస్తామని యూనియన్ సత్తెనపల్లి ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు సుజాత, అహల్య తెలిపారు. ఐసిడిఎస్ ఏర్పడి 50 ఏళ్లు పూర్తయ్యి స్వర్ణోత్సవాలు నిర్వహించుకుంటున్న తరుణంలోనూ ఆ రంగంలో పనిచేస్తోన్న అంగన్‌వాడీలు, హెల్పర్లు ఉద్యోగ భద్రతకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక సమస్యలను అంగన్వాడీలు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్నారని, వీటిపై జిల్లా మహాసభలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. సభకు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బారావమ్మ ముఖ్య అతిథులుగా, 200 మంది ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు.



విద్యార్థినీలు అన్ని రంగాల్లో ముందుండాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

విద్యార్థినీ లు అన్ని రంగాల్లో ముందుండాలని ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ అమూల్య అన్నారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో ఎస్ఎఫ్ఐ నూతన గర్ల్స్ కమిటీ బుధవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ అమూల్య మాట్లాడుతూ విద్యార్థినీలు చదువులోనే కాకుండా ఆటల్లో కూడా ముందుండాల న్నారు. పాలకులు మారుతున్న విద్యార్థినీలకు, మహిళలకు రక్షణ లేకుండా పోతుందని అన్నారు. పిడుగురాళ్ల మండల నూతన గర్ల్స్ కమిటీ అధ్యక్ష,కార్యదర్శులుగా జోష్ణప్రియ, రమ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో విద్యార్థులు చంద్రిక, ప్రియాంక మండల అధ్యక్షుడు కడియం రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పల్నాడు జిల్లాకు యుటిఎఫ్ రణబేరి జాత



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విద్యారంగంలో సమస్యలు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన రణభేరి జాతాను జయప్రదం చేయాలని యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరెడ్డి, ఎం.మోహనరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు నరసరావుపేటలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో వాల్‌పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతా గురువారం పల్నాడు జిల్లాలో చిలకలూరిపేట నుండి ప్రారంభమై నరసరావుపేట, నకరికల్లు, పిడుగురాళ్ల, రాజుపాలెం, సత్తెనపల్లి, మేడికొండూరు మీదుగా శుక్రవారం గుంటూరు జిల్లాలోకి ప్రవేశిస్తుందన్నారు. జాతాతోపాటు ఉపాధ్యాయుల బైక్ ర్యాలీ ఉంటుందని, ఉపాధ్యాయులు భారీగా హాజరవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు టి.వెంకటేశ్వర్లు, ఎల్.పూర్ణచందర్రావు, వై.శ్రీనివాసరావు, డి.కోటేశ్వరరావు, జి.వెంకటేశ్వర్లు, ఎం.రామాంజనేయులు, ఆర్.చంద్రయ్య, బాష, బ్రహ్మయ్య, సువర్ణరాజు, శ్రీనివాసరావు, లింగారావు, అప్పల రాముడు, లక్ష్మయ్య, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి

రణభేరి జాతా అనంతరం 25న విజయవాడలో జరిగే భారీ సభలో ఉపాధ్యాయులంతా పాల్గొనాలని యుటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రమేష్‌బాబు, విష్ణుమూర్తి కోరారు. ఈ మేరకు కరపత్రాలను ఆవిష్కరించారు. జాత గురువారం సాయంత్రం నాలుగు గంటలకు సత్తెనపల్లి చేరుకుంటుందని, పట్టణ పరిసర ప్రాంతాల ఉపాధ్యాయులందరూ పాల్గొనాలని కోరారు. నాయకులు రవీంద్రనాథ్ ఠాగూర్, భద్రయ్య, ఆనందరావు, జి.వెంకటరావు, శేషగిరి, తాజుద్దీన్, సురేష్, వైయస్సార్, అయ్యప్ప సునీత పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రాజుపాలెం

రణభేరి కరపత్రాలను మండల కేంద్రమైన రాజుపాలెంలో యుటిఎఫ్ నాయకులు ఆవిష్కరించారు. కె.గణేష్ కుమారి, కె. శ్రీనివాసరావు, కె.సురేఖ, బి.ఫణికుమార్, కె.శ్రీనివాసరావు, పి.నేతాజీ, టి.నాగరామారావు, డి.శ్రీనివాసరావు, కె.రత్తయ్య, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

సమస్యల పరిష్కారం కోసం యుటిఎఫ్ చేపట్టిన రణభేరి ప్రచారజాతను విజయవంతం చేయాలని యుటిఎఫ్ మండల అధ్యక్షులు ఎంవి సాంబశివరావు కోరారు. ఈ మేరకు కరపత్రాలను ఆవిష్కరించారు. గురువారం మధ్యాహ్నం 1 గంటకు ప్రచార జాతా పిడుగురాళ్లకు వస్తుందని, మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద నిర్వహించే సమావేశానికి ఉపాధ్యాయులంతా హాజరవ్వాలని కోరారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్, జివి ఆంజనేయులు, మక్కెన మల్లికార్జునరావు తదితరులు

ఈపూరులో కోల్డ్ స్టోరేజీకి మంత్రి శంకుస్థాపన

ప్రజాశక్తి-ఈపూరు

పొగాకును కొనుగోలుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నా వాటిని నిల్వ చేసేందుకు గోదాములు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండల కేంద్రమైన ఈపూరులో సొసైటీ ఆధ్వర్యంలో కోల్డ్ స్టోరేజ్ నిర్మాణానికి ప్రభుత్వ చీఫ్‌విప్ జివి ఆంజనేయులు, జిడిసిసి బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావుతో కలిసి మంత్రి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి రవికుమార్ మాట్లాడుతూ ఈపూరు పరిసర ప్రాంత రైతులకు అందుబాటులో ఉండేలా 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల కోల్డ్ స్టోరేజ్‌ను రూ.11.88 కోట్లతో నిర్మించడం మంచి విషయమని, పంట చేతికందేలోగా నిర్మాణం పూర్తి చేయాలని అన్నారు. రాష్ట్రంలో 20 లక్షల సూర్య ఘర్ కనెక్షన్లను లక్ష్యంగా పెట్టుకున్నామని, 300 యూనిట్లు ఆపై విద్యుత్ వినియోగదారులు సోలార్ విద్యుత్ ఏర్పాటుకు మొగ్గు చూపాలని సూచించారు. 2014-19లో మిగులు విద్యుత్తు ఉండగా వైసిపి పాలనలో రూ.1.30 లక్షల కోట్ల అప్పులు చేశారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం చొరవతో రాష్ట్రానికి వేల టన్నుల ఎరువులు వచ్చాయని చెప్పారు. ఎరువులు వినియోగం పెరిగిందని, దీన్ని తగ్గించాలని రైతులను కోరారు. జివి ఆంజనేయులు మాట్లాడుతూ ప్రతి మండలంలో కోల్డ్ స్టోరేజ్ నిర్మాణం అవసరమన్నారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న వాణిజ్య పంటల సాగు వైపు మొగ్గు చూపాలని రైతులకు సూచించారు. పామాయిల్, పండ్ల తోటలు సాగు చేస్తే ప్రభుత్వం రాయితీ అందిస్తుందని, అధిక లాభాలు పొందవచ్చని అన్నారు. వరికపూడిసెల ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం రూ.1925 కోట్లు మంజూరు చేసిందన్నారు. మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ ఆరు నెలల్లో కోల్డ్ స్టోరేజ్ పూర్తి చేసేందుకు సహకరిస్తానన్నారు. అనంతరం ఈపూరు సొసైటీ నూతన పాలకవర్గం పర్సన్ ఇన్‌ఛార్జి విడపలపాటి హనుమయ్య, సభ్యులు అయినాల కోటేశ్వరరావు, చిందుకూరి నరసింహారావు చేత మంత్రి రవి ప్రమాణం చేయించారు. స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. విద్యుత్ శాఖ ఈఈ రాంబోట్లు, తహశీల్దార్ ఎ.నళిని, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఆర్.జగ్గారావు, అంగులూరు సొసైటీ అధ్యక్షులు టి.బాలయ్య, నాయకులు మోదుగుల సత్యనారాయణ, బొల్లా వెంకట కోటయ్య, జిడిసిసి బ్యాంక్ సిఈవో పోకా కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్, సెపక్‌తక్రా జిల్లా జట్ల ఎంపిక

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్-19 ఫుట్‌బాల్, సెపక్‌తక్రా బాలబాలికల జట్ల ఎంపికలు మండలంలోని నందిగామ జెడ్‌పి పాఠశాలలో బుధవారం జరిగాయి. ఫుట్‌బాల్‌కు ఎంపికైన క్రీడాకారులు కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని స్కూల్ గేమ్స్ కార్యదర్శి జి. నరసింహారావు తెలిపారు. కార్యక్రమంలో అండర్-19 స్కూల్ గేమ్స్ జాయింట్ సెక్రటరీ కె.పద్మాకర్, పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎన్.సురేష్ కుమార్, విద్యా కేంద్రం డైరెక్టర్ నిమ్మగడ్డ చిట్టిబాబు, ప్రిన్సిపల్ షేక్ మౌలాలి, ఫిజికల్ డైరెక్టర్ పి.శివరామకృష్ణ, పిఇటిలు జి.సాంబశివరావు, బి.అనిల్ దత్త నాయక్, కె.కిరణ్ కుమార్ కోచ్‌లు పి.సురేష్, పి.వెంకటేశ్వర్లు హాజరయ్యారు.

బాలుర జుట్టు : పి.తేజ, డి.శివసాయికృష్ణ, యు.గిరి, షేక్ మహమ్మద్, కె.బన్ను, జె.చరణ్ కుమార్, ఎల్.పార్ధసారధి, పి.నాగసాయి, ఎమ్‌డి.అఫీజ్, వి.విల్‌స్మిత్, ఎస్‌డి.అలీ, షేక్ సోయల్, పి.నవీను, కె.చిరంజీవి, ఎమ్.మనోహర్, షేక్ సోయల్ తన్వీర్, సి.జోయల్, టి.మోహన వెంకట ధీపక్, స్టాండ్‌బైలుగా ఎ.నవీన్, ఎస్.హరిసత్యవర్ధన్, వై.సాత్విక్.

బాలికల జుట్టు : ఎన్.రమ్య, ఎన్.అమూల్య, హరిప్రియ, కె.స్నేహలతా, వి.అఖిల, పిఎంఎస్.సాహితి, ఒ.దీవెన, పి.శ్రీలేఖ, పి.దివ్యశ్రీ, ఐ.పూజిత, జి.సౌజన్య, కె.బ్లేషీ, కె.పూర్ణిమా, సిహెచ్ రాఘవ, కెవి.దీక్షా, బి.మాధవి, పి.అక్షయ, షేక్ ఉమ్రా, స్టాండ్ బైలుగా జి.అను, ఎం.పల్లవీ, డి.ప్రవలిక ఎంపికయ్యారు.

సెపక్‌తక్రా బాలుర జుట్టు : వై.ప్రభుదాస్, ఎం.మనోహర్, కె.చిరంజీవి, డి.జాన్సన్, పి.గోపిచంద్, స్టాండ్ బైలుగా పి.పవీన్, కె.విజయచోళుడు, బి.అనిల్.

బాలికల జుట్టు : ఒ. దీవెన, ఎం.రమ్య, ఎం.భార్గవీ, జి.గాయత్రీ, ఆర్.లీలాప్రసన్న, స్టాండ్ బైలుగా ఎన్.దివ్య సుందరీ, పిఎంఎస్.సాహితి, కె.మల్లిక ఎంపికయ్యారు.

అక్రమ కేసులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం..

ప్రజాశక్తి - మాచర్ల



అక్రమ కేసులకు భయపడేది లేదని మాజీ ఎమ్మెల్యే, వైసిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. జూలకంటి బ్రహ్మారెడ్డి ఎమ్మెల్యే అయ్యాక వైసిపి కార్యకర్తలను అక్రమ కేసులతో వేధిస్తున్నారని, ఎమ్మెల్యేగా ప్రజలిచ్చిన అవకాశాన్ని మంచి చేయడానికి ఉపయోగించాలేగాని కక్షపూరిత రాజకీయాల కోసం కాదని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వేధింపులు తాళలేక 570పైగా కుటుంబాలు వలసలు వెళ్లారని, ఆరు పీడీ యాక్ట్ కేసులు నమోదు చేశారని చెప్పారు. పీడీ యాక్ట్ కేసుల్లో అప్పటి కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు సహకరించారని, వారిపై ఉన్నతాధికా రులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. త్వరలో పల్నాడు జిల్లా ఎస్పీని కలిసి మాచర్లలో జరుగుతున్న అక్రమ కేసులు, వేధింపులపై వివరిస్తామన్నారు. వరికపూ డిశెల ప్రాజెక్టుకు అనుమతులు వైసిపి హయాంలో వచ్చాయని, రాబోయే బడ్జెట్లో రూ.3807 కోట్లు కేటాయించి పనులు చేపట్టేలా ఎమ్మెల్యే చూడాలని కోరారు.

నీచ రాజకీయాలు చేస్తే నియోజకవర్గానికి రానివ్వం..

ప్రజాశక్తి - మాచర్ల



హత్యలు, దోపిడీలు, దౌర్జన్యాలు, దాడులకు తెగబడిన వారు ఇప్పుడు నీతులు చెబుతున్నారని మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని ఉద్దేశించి ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఎద్దేవ చేశారు. కెసిపి గెస్ట్ హౌస్‌లో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో వేల మంది టిడిపి కుటుంబాలపై అక్రమ కేసులు బనాయించి, దాడులకు తెగబడ్డారని, హత్య రాజకీయాలకు తెర తీశారని అన్నారు. వరికపూడిసెల ప్రాజెక్టుపై బూటకపు హామీలతో ప్రజల్ని మోసం చేశారన్నారు. నీచ రాజకీయాలకు పాల్పడితే పిన్నెల్లి సోదరులను నియోజకవర్గంలో అడుగు పెట్టనివ్వబోమన్నారు. గడచిన 15 నెలల్లో రూ.వేల కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని, 15 ఏళ్లుగా ఆయన హయాంలో ఏం చేశారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రజలకు క్షమాపణలు చెప్పి రాజకీయ సన్యాసం తీసుకోవాలని సూచించారు.





కొల్లిపర, తెనాలి'స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్'లో పాల్గొన్న మంత్రి నాదెండ్ల మనోహర్,తుళ్లూరులో వైద్య సేవలందిస్తున్న డాక్టర్లు

'స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్'తో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - తెనాలి

'స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్'తో మహిళలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేయనున్న 'స్వస్థ్ నారి స్వశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమాన్ని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో బుధవారం ఆయన ప్రారంభించారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి అధ్యక్షత వహించారు. మంత్రి మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ పుట్టినరోజు సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళలకు అవసరమైన ఆరోగ్య సేవలు, పౌష్టికాహారం వంటివి అందుతాయన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల అందుబాటు, వైద్యుల వివరాలు సూపరింటెండెంట్ ద్వారా తెలుసుకున్నారు. మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు.

వృద్ధులకు ఉపకరణాలు పంపిణీ

ఈ సందర్భంగా జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో పలువురు వికలాంగులు, వృద్ధులకు వీల్ చైర్లు, వాకింగ్ స్టిక్స్, హియరింగ్ బడ్స్ అందించారు. అలాగే సాధ్యమైనంత త్వరగా రూరల్ గ్రామాలు, కొల్లిపర మండలంలో కూడా దివ్యాంగులను గుర్తించి వారికి ఉపకరణాలు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్‌తో పాటు వైద్య బృందం పాల్గొన్నారు.

ప్రజాశక్తి - కొల్లిపర

ఆరోగ్య వంతమైన మహిళ శక్తివంతమైన ఆరోగ్య వంతమైన కుటుంబాన్ని నిర్మించుకుంటుందని పౌర సరఫరాల శాఖ మాత్యులు నాదెండ్ల మనోహర్ అన్నారు. మండలంలోని మున్నంగి గ్రామంలో ప్రాథమిక వైద్య కేంద్రం నందు 'స్వస్థ్ నారి స్వశక్త్ పరివార్ అభియాన్' మెడికల్ క్యాంపును ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మెడికల్ క్యాంపులో మహిళలు ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. కుంచవరం, దంతులూరు గ్రామాల్లో నూతన పంచాయతీ భవనాల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి మెడికల్ ఆఫీసర్ పి.శ్రావణి, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల

ప్రారంభ దశలో వ్యాధులను గుర్తించినట్లయితే ప్రాణాంతక జబ్బుల నుండి విముక్తి పొందవచ్చు నని ఎంపీపీ షేక్ జబీన్ అన్నారు. స్థానిక బిపి కళ్యాణ మండపంలో బుధవారం జరిగిన 'స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్'లో భాగంగా ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపునకు మంగళగిరి ఎయిమ్స్, గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన వివిధ రంగాలకు చెందిన వైద్య నిపుణులు సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంట్లో మహిళ ఆరోగ్యంగా ఉంటే కుటుంబం తద్వారా సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. యార్డు చైర్మన్ ఉన్నం ఝాన్సీ, మండల టిడిపి అధ్యక్షులు కేశంనేని శ్రీ అనిత, పిహెచ్సి వైద్యురాలు డాక్టర్ ఇందిద, డాక్టర్ ఇజాస్ అబ్దుల్ రెహమాన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెనిగళ్ళ శ్రీకృష్ణ ప్రసాద్ దోస్త్ అధ్యక్షులు మిక్కిలినేని గాంధీ జనసేన మండల అధ్యక్షులు పసుపులేటి శ్రీనివాసరావు, జంపాల కోసం కుమారి జోగేంద్ర ప్రసాద్ చుండూరు ఉమా దేవరపల్లి చంటి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తుళ్లూరు

మహిళల ఆరోగ్య రక్షణకు స్వస్త్ నారీ సశక్తి పరివార్ పథకం దోహదపడుతుందని ప్రాథమిక వైద్యాధికారులు డి.శ్రీనివాస్, టి.శివ పార్వతి అన్నారు. రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు, వెంకటపాలెంలోని హెల్త్ వెల్ నెస్ సెంటర్‌లు, మందడం పిహెచ్‌సిలో బుధవారం ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు శ్రీనివాస్, ట.శివపార్వతి మాట్లాడారు. పిల్లలకు టీకాలు, పోషకాహారం ఆవశ్యకత గురించి వివరిస్తామన్నారు. రాజధాని రైతు జెఎసి, టిడిపి నాయకులు కాటా అప్పారావు మాట్లాడుతూ, రాజధాని వాసులు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పిహెచ్‌సి సూపర్‌వైజర్లు డి.శ్రీనివాసరెడ్డి, ఎస్.కె. కరీం, ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్ పిలు, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఫిరంగిపురం

నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 'స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డా. యానీ గ్రేస్, డాక్టర్ సబిరా బేగం, సిఎచ్ఓ ఎన్.వి. లక్ష్మి, హెల్త్ సూపర్వైజర్ కె. సుదర్శన్ రాజు, గ్రామ సర్పంచ్ నాగ మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.



ఆటోనగర్ లోని చేనేత వీవర్ శాలను సందర్శించిన మల్లేశం.

వీవర్‌శాలను సందర్శించిన మల్లేశం

ప్రజాశక్తి - మంగళగిరి

పద్మశ్రీ గ్రహీత చేనేత ఆశు యంత్రాన్ని కనిపెట్టి తన పేరుతో తన జీవిత చరిత్రను ఒక సినిమాగా తీసిన మల్లేశం సినిమా ఘనత పొందిన చింతక్రింది మల్లేశం బుధవారం మంగళగిరి పట్టణంలోని ఆటోనగర్ల గల వీవర్‌శాలను సందర్శించారు. ఈ సందర్భంగా మల్లేశం చేనేత కార్మికులు అడిగి వివరాలు తెలుసుకున్నారు. చేనేతలకు ఆదాయం పెంచేలా నా వల్ల ఇంకేమైనా పరికరాలు చేయడానికి మంగళగిరి వచ్చానన్నారు. ఇద్దరు టెక్నీషియన్స్ వచ్చారని వారు కూడా ఈ మెలకువలు చూసి ఇంకా చేనేతలకు మంచి జరిగేలా చూస్తారని తెలిపారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం రాష్ట్ర కో కన్వీనర్ డాక్టర్ మునగపాటి వెంకటేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకోటి అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

అనాధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - మంగళగిరి

ప్రముఖ సంఘ సేవకురాలు, లోక్ అదాలత్ మెంబరు, స్నేహ మహిళా మండలి అధ్యక్షురాలు నన్నపనేని లక్ష్మి 19వ వర్ధంతి సందర్భంగా బుధవారం చిన్న కాకాని గ్రామంలో గల షైన్ అనాధాశ్రమంలో లక్ష్మీ భర్త నన్నపనేని నాగేశ్వరరావు అన్నదానం చేశారు. 75 మంది పిల్లలకు అన్నదాన చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.




మంగళగిరి, తుళ్లూరులో రణభేరి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

యుటిఎఫ్ రణభేరి పోస్టర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి - మంగళగిరి

స్థానిక మున్సిపల్ యుపి స్కూల్‌లో బుధవారం రణభేరి పోస్టర్‌ను ఉపాధ్యాయుల ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి దౌలా, జిల్లా కార్యదర్శి టి. ఆంజనేయులు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ అడవి శ్రీనివాసరావు, మంగళగిరి మండల యూటీఎఫ్ నాయకులు పి.అరుణ్ కుమార్, చింత శ్రీనివాసరావు, పుష్పావతి, విజయ రాణి, వి.ప్రసాద్, పద్మలత, రజిని కుమారి, దాస్, చక్రవర్తి, బాబురావు, రెహమాన్, నాగరాజు, గోపీచంద్ పాల్గొన్నారు. మంగళగిరి మండలం యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శిగా సిహెచ్. శ్రీనివాసరావు, అధ్యక్షులుగా పి.అరుణ్ కుమార్‌లను ఎన్నుకున్నట్లుగా వారు తెలిపారు.

ప్రజాశక్తి - తుళ్లూరు

మండలంలోని మందడం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రణభేరి పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ అడవి శ్రీనివాసరావు, మండల గౌరవాధ్యక్షులు ఎ.కోటేశ్వరరావు, అధ్యక్షులు ఎ.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి టి.భాస్కర రావు, నాయకులు పి.శ్రీనివాసరావు, టి.ఉమామహేశ్వరరావు, ఎం.సాంబయ్య, కాశీ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చేబ్రోలు

యుటీ.ఎఫ్ కార్యాలయంలో రణభేరి పోస్టర్ను ఆవిష్కరించారు. ఈనెల 19న చేబ్రోలు మండలంలో రాష్ట్ర వ్యాప్త జాత కార్యక్రమం జరుగుతుంది. ఈ సందర్భంగా యు.టి.యఫ్. జిల్లా కార్యదర్శి జి. వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. 19వ తేదీన చేబ్రోలు జరిగే రణభేరీ కార్యక్రమంలో మండలంలోని ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఈ.పార్ధసారధి, మండల సహా అధ్యక్షులు ఎం.శ్రీనివాసరావు, కోశాధికారి కె.శ్రీనివాసరావు, మండల నాయకులు శివ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థుల ఫీల్డ్ విజిట్

ప్రజాశక్తి- తాడేపల్లి

స్థానిక నెహ్రూ బొమ్మ సెంటర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ఒకేషనల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా ఆటోమోటివ్ ట్రేడ్‌లో బుధవారం ఫీల్డ్ విజిట్ నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు భీమిరెడ్డి తాతి రెడ్డి, ఒకేషనల్ ట్రైనర్ అరవింద్ మరియు ఐసిఏ ఎడ్యుకేషనల్ స్కిల్స్ వారి ఆధ్వర్యంలో కేఎల్ యూనివర్సిటీని విద్యార్థిని విద్యార్థులు సందర్శించారు.జ్ఞాన సమపార్ధనకు ప్రత్యక్ష అనుభవాలు కలిగించడానికి ఇలాంటి ఫీల్డ్ విజిట్లు ఉపయోగపడతాయని ప్రధానోపాధ్యాయులు తాతి రెడ్డి, ఒకేషనల్ ట్రైనర్ అరవింద్ తెలిపారు.



ఫీల్డ్ విజిట్‌లో పాల్గొన్న విద్యార్థులు

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు వడ్డేశ్వరం జడ్పీ హైస్కూల్ విద్యార్థిని

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్



విద్యార్థిని నవీన

బాపట్ల జిల్లా, ముత్తాయిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం జరిగిన వాలీబాల్ పోటీలలో ఎంటిఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ హై స్కూల్, 9వ తరగతి చదివే విద్యార్థిని సిహెచ్ నవీన అండర్ 14 వాలీబాల్ పోటీలకు ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాకుమాను జోజప్ప బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు మెల్లంపూడి రవి, నూతక్కి రవి, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పలువురు విద్యార్థిని నవీన ను అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొని పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.




ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి పోటీలకు అంగలకుదురు జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు

ప్రజాశక్తి - తెనాలి

మండల పరిధిలోని అంగలకుదురు విఎస్ఆర్అండ్ జెడిఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం ఎన్.అనురాధ బుధవారం తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో రన్నింగ్‌లో పాఠశాలకు చెందిన సిహెచ్ ఆంజనేయులు 1000 మీటర్ల విభాగంలో ద్వితీయ స్థానం, సిహెచ్ కరుణ 600 మీటర్ల విభాగంలో, సిహెచ్ ప్రశాంతి 400 మీటర్ల విభాగంలో ద్వితీయ స్థానం, ఎం.అఖిల్ 600 మీటర్ల విభాగంలో ప్రథమ స్థానం, 60 మీటర్ల విభాగంలో ద్వితీయ స్థానం సాధించారు. ఈనెల 27 నుంచి 29 వరకు ఏలూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో వీరు పాల్గొంటారని ఆమె తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.



టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు సన్మానిస్తున్న నిర్వాహకులు

సన్ ఫ్లవర్ హ్యాండ్లూమ్‌ను సందర్శించిన టిటిడి చైర్మన్

ప్రజాశక్తి - మంగళగిరి

టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు బుధవారం టీటీడీ పాలకమండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకి దేవి ఆధ్వర్యంలో నడుస్తున్న సన్ ఫ్లవర్ హ్యాండ్లూమ్ షోరూంను సందర్శించి చేనేత వస్త్రాల ప్రత్యేకతలను తెలుసుకున్నారు. షోరూమ్‌లో ప్రదర్శనకు ఉంచిన పట్టు, కాటన్, జరీ, డిజైనర్ చీరలు, సంప్రదాయ చేనేత దుస్తులను పరిశీలించిన ఆయన నాయుడు చేనేత కళాకారుల కృషిని అభినందించారు. స్థానిక చేనేత రంగం అభివృద్ధి చెందేందుకు ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. టీటీడీ తరఫున కూడా చేనేత రంగానికి తోడ్పాటు అందించేందుకు కృషి చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు. తమ్మిశెట్టి జానకి దేవి మాట్లాడుతూ సన్ ఫ్లవర్ హ్యాండ్లూమ్ ద్వారా స్థానిక కళాకారులకు మరింత మార్కెట్ అవకాశాలు కల్పిస్తున్నాం అని తెలిపారు.


విజయకుమారిని సన్మానిస్తున్న సమితి సభ్యులు

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కలెక్టర్, పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారిని నుంచి మాచర్ల మండలం కంభం పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆర్ విజయ కుమారి అవార్డు అందుకున్నారు. మదర్ థెరీసా సేవా సమితి అధ్యక్షు లు గాదె కిరీటిరెడ్డి, సభ్యులు బుధవారం ఆమెను సత్కరిం చారు.ప్రముఖ న్యాయవాది చిలమకూరి నాగిరెడ్డి మాట్లా డుతూ గత సంవత్సరం పదో తరగతి ఫలితాలలో నూటికి నూరుశాతం సాధించడం, ఐఎంఎంఎస్ సీట్లు మూడు సంపా దించడం, పాఠశాల పరిశుభ్రత పచ్చదనం వంటి అంశా లను పరిగణలోకి తీసుకొని దరఖాస్తు చేయకపోయినా అధికారులు గుర్తించి విజయకుమారికి అవార్డు ఇవ్వటం సంతోషకర మన్నారు. కార్యక్రమంలో కామిరెడ్డి విజయలక్ష్మి పండిట్, శివ పార్వతి, నిర్మలమేరీ, రామేశ్వరమ్మ, భాస్కర్ రెడ్డి, అందుగుల చంద్రయ్య, కసిరెడ్డి శాంతిరెడ్డి, ముత్యాల పాపిరెడ్డి, జక్కిరెడ్డి చిన్నపరెడ్డి, ప్రముఖ న్యాయవాది ఏ.బాలజోజి, మాచర్ల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ ఎరబోతుల శ్రీనివాస రావు, మహేష్, జె శ్రీనివాసరావు సత్కరించారు. తనను సత్కరించిన సభ్యులకు విజయ కుమారి కృతజ్ఞతలు తెలిపారు.



పొగాకుకు వ్యతిరేకంగా విద్యార్థులు ప్రదర్శిస్తున్న నాటిక

పొగాకు వ్యతిరేక అవగాహనా ర్యాలీ, ప్రదర్శన

ప్రజాశక్తి - క్రోసూరు

పొగాకు వ్యతిరేక విద్యాలయాలు కార్యక్రమంలో భాగంగా క్రోసూరు ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు అవగాహనా ర్యాలీ నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ మేరీ సూజన్ తెలిపారు. ఆమె మాట్లాడుతూ ర్యాలీ క్రోసూరు నాలుగు రోడ్ల కూడలి నుండి అందుకూరు రోడ్డు సెంటర్ వరకు సాగించన్నారు. పొగాకు వాడకం, ధూమ పానం వలన కలిగే అనర్థాలను నష్టాలను వివరిస్తూ విద్యార్థులు ప్రదర్శించిన ప్లకార్డులు, నినాదాలు ప్రజ లను ఆకట్టుకున్నాయన్నారు. చివరిగా విద్యార్థులచే ప్రదర్శిం పబడిన నాటిక ప్రదర్శన ప్రజలను ఆలోచింప చేసేదిగా ఉందని అన్నారు. ఇందుకు సహకరించిన క్రోసూరు పోలీస్ విభాగానికి, ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులకు, అధ్యాపకు లకు ధన్యవాదాలను తెలిపారు.

విద్యార్థులు రక్తదానం

ప్రజాశక్తి - మాచర్ల రూరల్



రక్తదానం చేస్తున్న విద్యార్థి

నేషనల్ వాలంటరీ బ్లడ్ డొనేషన్ డే డ్రైవ్ సందర్భంగా మాచర్ల ప్రభుత్వ వైద్యశాలలో వికాస్ డిగ్రీ కళాశాలకు చెందిన వి. మల్లికార్జున, ఎం. అజయ్, ఎం. మణికంఠ పి.శ్రీకాంత్ వై. శ్రీనివాసరావు రక్తదానం చేశారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగు లకు అత్యంత ప్రధానమైన బ్లడ్ డొనేషన్ కార్యక్రమంలో పాల్గొన టం స్ఫూర్తిదాయకమని, విద్యార్థులను కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ పఠాన్ నాగుర్‌వలి అభినందించారు. సమాజం పట్ల యువత బాధ్యతగా వ్యవహరించాలని కళాశాల చైర్మన్ మారెపల్లి లక్ష్మీనారాయణ, డైరెక్టర్ వెంకటనారాయణ, ఆంజ నేయ శాస్త్రి అన్నారు ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.పి చారి, క్యాంపు పర్యవేక్షకులు రజాక్ పాల్గొన్నారు.


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జూలకంటి


సత్తెనపల్లిలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే 'కన్నా'

మహిళల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు

ప్రజాశక్తి - మాచర్ల

మహిళల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, మెరుగైన వైద్య సేవల ద్వారా కుటుంబాలను, దేశాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'స్వస్థ్ నారీ - సశక్త్ పరివార్ అభియాన్' వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే జూలకంటి ప్రారంభించి మాట్లాడారు. మహిళల్లో సంభవించే రొమ్ము క్యాన్సర్, థైరాయిడ్, టి.బి, గర్భాశయ వ్యాధులు ప్రాథమిక దశలో గుర్తించి చికిత్స తీసుకోవాలని అన్నారు. జిల్లా డిసిహెచ్ఎస్ డాక్టర్ ప్రసూన, సూపర్నింటెండెంట్ డాక్టర్ కెపి చారి, డాక్టర్లు వెన్నెల, అరుకుమార్ క్షయ లక్షణాలు, తీసుకో వల సిన జాగ్రత్తలు తెలియపరిచారు. కార్యక్రమంలో టిబి యూనిట్ సూపర్‌వైజర్ భీమా నాగేశ్వరరావు, సుధాకర్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు వెనుక ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రంలో స్వస్థ నారీ -సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారా యణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శిబిరాల్లో మహిళల కోసం ప్రత్యేకంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు, రక్త హీనత, టీబీ, సికిల్ సెల్ వ్యాధి పరీక్షలతో పాటు గర్భిణులు, బాలింతలకు వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. గైనకా లజీ, పీడియాట్రిక్స్, డెర్మటాలజీ వంటి ప్రత్యేక వైద్య సేవలను, రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కూటమి నాయకులు ఆరోగ్య కేంద్రం వైద్యులు పాల్గొన్నారు

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని బోయపాలెం గ్రామంలో చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మండల పార్టీ అధ్య క్షులు కామినేని సాయిబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని కార్డులను పంపిణీ చేశారు. అనంతరం ఇంటింటి తిరిగి కార్డులను అందజేశారు. సాయిబాబు మాట్లాడుతూ కార్డు లు క్యూఆర్ కోడ్‌తో అధునాతన సాంకేతికతను కలిగి పారదర్శ కత, సమర్థవంతమైన సేవలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ బాజీ, గ్రామ పార్టీ అధ్యక్షులు రాజ అహ్మద్, బత్తుల నరసయ్య, సచివాలయ సెక్రటరీ, పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు మహిళలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - క్రోసూరు

స్మార్ట్ కార్డుల పంపిణీ వందశాతం పూర్తి చేయాలని క్రోసూరు మాజీ యార్డ్ చైర్మన్ కాంద్రు కాశయ్య అన్నారు. ఆయన మాట్లాడుతూ వీఆర్వోలు ఇంటింటికి తిరిగి ప్రజల కు కార్డులు అందజేస్తున్నారని తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులుపంపిణీ చేసారు. నలజాల కోటి, డి.యోహాను, జె. వెంకట్రావు, హస్సను, ఏ. వెంకట్రామి రెడ్డి, ఏ. పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేచే విశ్వకర్మ పతాకం ఆవిష్కరణ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

విశ్వబ్రాహ్మణుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సత్తెన పల్లి పట్టణంలోని 23వార్డులో బుధవారం జరిగిన విశ్వకర్మ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని విశ్వకర్మ పతా కాన్ని ఆవిష్కరించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ యేలినేడి రామ స్వామి, పట్టణ టిడిపి నాయకులు దరువూరి నాగేశ్వర రావు, రాష్ట్ర నాయిబ్రాహ్మణ బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గంగా ధర్, పట్టణ అధ్యక్షులు మస్తాన్‌వలి, సత్తెనపల్లి నియోజకవర్గ బీజేపీ అధ్యక్షులు కట్టా శంకరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

భగవాన్ విశ్వకర్మ జయంతిని పురస్కరించుకొని స్థానిక శరాబు బజారులో విశ్వకర్మ భగవాన్ ఉత్సవ కమిటీ నిర్వహించిన 40వ వార్షికోత్సవ పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వబ్రాహ్మణుల పెద్దలు ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలను అందజేశారు. టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ధారునాయక్, తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సాతులూరి కుమార్, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ కొమెర దుర్గారావు, టీడీపీ సీనియర్ నాయకులు యెను ముల కేశవరెడ్డి, కజ్జం సైదయ్య, గోగుల వెంకట్రామిరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ రాజబోయిన మధు, వైస్ చైర్మన్ గుండాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దళితుల గురించి మాట్లాడే అర్హత పిన్నెల్లికి లేదు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

కూటమి ప్రభుత్వంలో దళితులకు అన్యాయం జరుగు తోందని వైసీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామ కృష్ణారెడ్డి అనడం హాస్యాస్పదంగా ఉందని ఏపీ ఎస్సీ కార్పొ రేషన్ రాష్ట్ర డైరెక్టర్ సాతులూరి కుమార్ అన్నారు. జగ న్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దళితులకు సం బంధించిన 27 సంక్షేమ పథకాలు రద్దు చేయడం, దళితుడైన డాక్టర్ సుధాకర్, కరుణాకర్, దళిత మహిళలపై దారుణంగా హత్యలు, అత్యాచారాలు చేసిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం దళితుల గురించి మాట్లాడటం సిగ్గుచేటు అని ఎద్దేవా చేసారు. దళితులు అభివృద్ధి చెందాలన్నా, దళితులు గౌరవించబడాలన్న ఒక్క తెలుగుదేశం పార్టీ, చంద్రబాబు, లోకేష్‌తోనే సాధ్యం అని అన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని విద్యుత్ చోర్యంపై విజిలెన్స్ అధికా రులు తనిఖీలు నిర్వహించారు.18 గ్రామాల్లో 40 బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపట్టారు. 34 విద్యుత్ చోర్యం కేసులను గుర్తించి రూ.1,17,600 అపరాధ రుసుము విధించినట్లు అధికారులు తెలిపారు.

పోషణ మాసోత్సవాలు

ప్రజాశక్తి - రెంటచింతల

అంగనవాడి కేంద్రాల్లో రాష్ట్రీయ పోషణ మాసోత్స వాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ జ్యోతి మాట్లాడుతూ వచ్చే 16వ తేదీ వరకు ప్రతిరోజు కార్యక్రమాల పట్టికను ప్రదర్శించాలన్నారు. తల్లు లు, చిన్నారుల్లో స్థూలకాయం నివారణకు చక్కెర విని యోగం తగ్గించడం, బాల్యదశ సంరక్షణ, అక్షరాలు నేర్పిం చడం వంటి అంశాలను గురించి వివరించారు. కార్యక్రమం లో ఆశ, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

రవికుమార్‌కి జాతీయ పురస్కారాలు ప్రదానం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సత్తెనపల్లికి చెందిన పౌరాణిక రంగస్థల నటులు రవి కుమార్‌కు రెండు విశిష్ట జాతీయ పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ మేరకు హైదరాబాద్ శారదా మ్యూజిక్ అకా డమీ ఆర్ట్ ఆఫ్ లెర్నింగ్ ఆధ్వర్యంలో ఈనెల 13న జరిగిన తెలుగు కీర్తి కిరీటులు 2025 అంతర్ పురస్కారాలు ప్రదానం జరిగింది. కార్యక్రమానికి సభాధ్యక్షులుగా నాదమునుల రామారావు విజయలక్ష్మి., ముఖ్యఅతిథిగా ఆకుల రమేష్, గౌరవ అతిథిగా సుభాష్ గుప్తా, విశిష్ట అతిథి పద్మిని నాగుల పల్లి, మాంగళ్యం పౌండేషన్ చైర్మన్ కీర్తిలత గౌడ్, జీవన స్రవంతి పాల్గొన్నారు. వివిధ రంగాల్లో ప్రావీణ్యం పొందిన వారికి ఈ పురస్కారాలు ప్రదానం చేసారు.

జూమ్ మీటింగులతో కాలయాపన

ప్రజాశక్తి-చిలకలూరిపేట

సమస్యలపై కార్యాలయాలకు వెళ్తే అధికారులు అందు బాటులో ఉండటం లేదు. ఏమిటని ప్రశ్నిస్తే సార్ జూమ్ మీటింగ్‌లో ఉన్నారు... మళ్లీ రండి అంటూ సిబ్బంది చెబు తున్నారు. అధికారులను కలవాలంటే రోజంతా వేచి ఉడాల్సి వస్తోందని ప్రజలు వాపతున్నారు. కూటమి ప్రభుత్వం 'జూమ్' మీటింగులతోనే పాలన సాగిస్తుందనే విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. మండల పరిధిలో దాదాపు 1.40 లక్షల జనాభా ఉన్నారు. వీరంతా ఏదో ఒక సమస్యపై ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్తే అధికారులు అందుబాటులో లేకపోవడం, వారి కోసం రోజంతా వేచి ఉండాల్సి రావడం పట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రజల వద్దకే పాలన అంటూ చెప్పిన టిడిపి ఇప్పుడు కూటమి ప్రభుత్వంగా ఏర్పడిన తర్వాత ప్రజలకు దూరంగా పాలన అన్నట్లు ఉందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో కొంత మంది మధ్యవర్తిత్వం సాగిస్తున్నారు. నాయకులతో,అధికారులతో మాట్లాడి మీ సమస్యను పరిష్కరిస్తాం ఖర్చవుతుందని డబ్బు వసూలు చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్ర భు త్వం జూమ్ మీటింగుల పాలన కాకుండా, అధికారులు ప్రజలతో మమేకమై పాలన చేసేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

వావిలాల జయంతి వేడుకలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

స్వాతంత్ర సమర యోధులు, పద్మ భూషణ్ అవార్డు గ్రహీత మాజీ శాసన సభ్యులు వావిలాల గోపాల కృష్ణయ్య 120 వ జయంతి వేడుకలు స్థానిక వావిలాల ఘాట్లో బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎంత ఎదిగిన ఒదిగి ఉండే స్వాభావం ఆయన సొంతమన్నారు. ఆయన జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం వావి లాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిం చారు. ఆయన వెంట పలువురు నాయకులు, కార్య కర్తలు, అభిమానులు ఉన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదాం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడా లని ఏపీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నయింభాను అన్నారు. బుధవారం ఓజోన్ డేను పురస్కరించుకొని కళా శాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కలు నాటి మాట్లాడారు. ఓజోన్ పొరకు రంధ్రం పడటం వలన వచ్చే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమం లో రసాయనశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం యానాదిరావు, ఎం శ్రీనివాసరావు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య విలువలు కాలరాసిన మోడీ

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను కాలరాసి దొంగఓట్లతో పాల్పడి, మూడోసారి గద్దె నెక్కిందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం ఆయన మాచర్ల పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఏఐసీసీ, పీసీసీ ఆదేశాల మేరకు ఈనెల 15 నుండి అక్టోబర్ 15 వరకు, ఓట్ల జాబితా అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న దేశ వ్యాప్త ఉద్యమంలో భాగంగా మండలాలు, ప్రధాన గ్రామాల్లో తలపెట్టిన సంతకాల సేకరణ ఉద్యమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మండల పార్టీ అధ్యక్షులు వంగపాటి నాగరాజు, కొమ్ము కోటేశ్వరరావు, చిమటా వెంకటేశ్వర్లు, దొడ్డా శ్రీనివాసరావు మరియు షేక్ బాబు,నాజర్ వలి, నాయక్ పాల్గొన్నారు.

వ్యర్థాలను చంద్రవంకలో వేయొద్దు

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణంలోని చంద్రవంక నదిలో, హైవేల పక్కన అనేక వ్యర్థ పదార్థాలు వేయటం వల్ల అవి కుళ్లిపోయి దుర్వాసన వస్తోందని, ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి బుధవారం తహశీల్దార్ బి. కిరణ్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. రోడ్డు పక్కన వాకింగ్ చేసేవారు, వివిధ పను ల నిమిత్తం రోడ్డు మీద నడుచుకుంటూ వెళ్లేవారు, వాహ నాల్లో సైతం వెళ్లే వారికి కూడా ఈ దుర్వాసన చాలా ఇబ్బం దికరంగా ఉందని తెలిపారు. వ్యర్థ పదార్థాలు చంద్రవంక నదిలో, హైవే పక్కన వేయకుండా డంపింగ్ యార్డ్ లోనే వేసేలా చర్యలు తీసుకోవాలనీ, మాచర్ల పట్టణ కమిషనర్ వేణుబాబు దృష్టికి ఈ విషయం తీసుకెళ్లాలని కోరారు. శ్రీరామకృష్ణ సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

అసెంబ్లీని ముట్టడిస్తాం : శ్రీను నాయక్

ప్రజాశక్తి-చిలకలూరిపేట

రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ అమలు చేసిన గిరిజన గురు కులాల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయు లకు తొలగించవని, ఉద్యోగ భద్రత కల్పించి, వేతనాలు చెల్లిస్తామని చెప్పిన ప్రభుత్వం విఫలమైందని ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర స హాయ కార్యదర్శి బి. శ్రీను నాయక్ అన్నారు. బుధవారం పట్టణ శివారులోని పురుషోత్తపట్నం గిరిజన గురుకుల ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లా డుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉనన 1700 మంది ఉపాధ్యా యులు సుమారుగా 5 ఏళ్ల నుంచి 18 ఏళ్లుగా గిరిజన గురుకుల పాఠశాలలో పని చేస్తున్నారని, వీరిని తొలగించే దుకు కుట్ర జరుగుతోందన్నారు. జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించకుంటే అసెంబ్లీని ముట్టడిస్తామని నాయక్ హెచ్చరించారు. కార్య క్రమంలో పి. స్టాలిన్ బాబు, జి యేసుదాను, ఈ.నారాయణ బాబు, ఏ. అంజన కుమారి, యూ. ఊర్మిళ, జి. పవన్ సుధా, గిరిజన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కనీస వేతన చట్ట ప్రకారం కార్మికులకు జీతాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న పల్లె కృష్ణ, దొంతిరెడ్డి వెంకటరెడ్డి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

చాలీ చాలని జీతాలతో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతన చట్ట ప్రకారం 26వేల రూపాయలు ఇవ్వాలని, సిఐటియు తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, సిఐటియు సీనియర్ నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం వడ్డేశ్వరం, ఇప్పటం గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో సతమతమవుతున్నారని అన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఆప్కాస్‌లో చేర్చని పారిశుద్ధ్య కార్మికులను వెంటనే ఆప్కాస్ లో చేర్చాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అన్ని సంక్షేమ పథకాలను ఆంక్షలు లేకుండా పారిశుద్ధ్య కార్మికులకు వర్తింపచేయాలని ప్రభుత్వాన్ని నాయకులు డిమాండ్ చేశారు. కార్మికుల పై పని భారం పెంచకుండా, అవసరమైన చోట అదనంగా కార్మికులను పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. పెండింగ్ ఉన్న హెల్త్ అలవెన్స్ వెంటనే కార్మికులకు జమ చేయాలని ఆయన అన్నారు. అనంతరం వడ్డేశ్వరం, ఇప్పటం గ్రామాల పారిశుధ్య గ్రామ కమిటీలను నాయకులు ఏర్పాటు చేశారు. వడ్డేశ్వరం గ్రామ పారిశుద్ధ్య కార్మిక సంఘం అధ్యక్షులుగా వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా గరిగా జ్యోతి, కార్యదర్శిగా కాకి బాబు, సహాయ కార్యదర్శిగా సరోజమ్మ, కోశాధికారిగా రమేష్ లను ఎన్ను కున్నారు. ఇప్పటం గ్రామ పారిశుద్ధ్య కార్మిక సంఘం అధ్యక్షులుగా సాంబశివరావు, కార్యదర్శిగా జి.పిచ్చయ్య, కమిటీ సభ్యులుగా కోటయ్య, అలివేలు, పోలయ్యలను ఎన్నుకున్నారు.

288వ రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశ క్తి- తాడేపల్లి

చట్ట ప్రకారం తమకు రావాల్సిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు బుధవారం నాటికి 288 రోజులకు చేరుకున్నాయి. దీక్షలను యూనియన్ నాయకులు కె.స్టీవెన్, బి.సూర్యప్రకాష్, వై.సాంబశివరావు, షేక్ సుభాని, తుపాకుల నాగేశ్వరావు ప్రారంభించారు. దీక్షలలో బి.దానయ్య, సి హెచ్.పిచ్చయ్య, దామవరపు నాగేశ్వరావు, సువర్ణకుమారి, ఉప్పు కాసమ్మ కూర్చున్నారు. కార్యక్రమంలో ఎం.ఆశీర్వాదం, ఇమాంబి, దుర్గాభవాని, శారమ్మా, డి.నాగమల్లీశ్వరి, ఇశ్రాయిల్ పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఛైర్‌పర్సన్

పాఠశాలను తనిఖీ చేసిన ఛైర్‌పర్సన్

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక 22వ వార్డు మఠం బజార్‌లో మునిసిపల్ స్పెషల్ ఎలిమెంటరీ పాఠశాలను మున్సిపల్ ఛైర్ పర్సన్ తాడిబోయిన రాధిక బుధవారం పరిశీలించారు. ఉపాధ్యాయ బృందంతో మాట్లాడారు. విద్యార్థుల హాజరు శాతాన్ని తెలుసుకున్నారు. విద్యార్థులకు అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. పాఠశాలలో చిన్న చిన్న సమస్యలను గుర్తించిన ఆమె పాఠశాల తరగతి గదులకు కిటికీలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని, విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో 22వ వార్డు కౌన్సిలర్ షేక్ మహబూబ్ బాషా, మునిసిపల్ డీఇ ఎ.శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఇంజనీర్ సూరిబాబు, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

స్త్రీశక్తి పథకంలో సమస్యలు తలెత్తనీయకండి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్త్రీ శక్తి పథకంలో ఎటువంటి సమస్య తలెత్తకుండా తమ సర్వీసులను నిర్వహించాలని ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగేంద్ర ప్రసాద్ అన్నారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆపరేషన్స్ ఎ.అప్పలరాజు, ఇంజనీరింగ్ విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చంచల్ రెడ్డితో కలిసి బుధవారం తెనాలి డిపోను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నాగేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పథకంలో ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. బ్రేక్ డౌన్ కాని సర్వీసులను మాత్రమే నడపాలని సూచించారు. సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని, కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ ఐ.జె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వీధికుక్కల సమస్య తీవ్రరూపం

ప్రజాశక్తి - పొన్నూరు

ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లోపించే వీధికుక్కల సమస్య రోజురోజుకు తీవ్రరూపం దాల్చుతోందని పొన్నూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అందే దిలీప్ దుయ్యబట్టారు. వీధికుక్కల దాడిలో గాయపడి మండల పరిధిలోని వెల్లలూరు గ్రామానికి చెందిన తాడిశెట్టి కార్తీక్ మరణించిన నేపథ్యంలో బుధవారం మండల రెవెన్యూ, విద్యా, వైద్య, పశు సంరక్షణ శాఖల అధికారులను కలసి వీధికుక్కల నియంత్రణ, చికిత్సలపై శాఖా పరంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. దిలీప్ మాట్లాడుతూ - ప్రభుత్వ శాఖల మధ్యన సమన్వయం ఉంటే వీధికుక్కల నియంత్రణ సాధ్యమని తెలిపారు.

యూరియా అందుబాటులో ఉంది

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

రైతులందరికీ కావలసినంత యూరియా అందుబాటులో ఉందని గుంటూరు వ్యవసాయ విస్తరణ అధికారి ఎన్.మోహన్‌రావు అన్నారు. బుధవారం యూరియా మీ చెంతకు కార్యక్రమం మండల వ్యవసాయ శాఖ అధికారి బి.అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడిఏ మాట్లాడారు. యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఓ కోటేశ్వరరావు, ఏఈఓ సింధూర, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా ఈ క్రాప్ నమోదు చేసుకోండి

ప్రజాశక్తి - కొల్లిపర



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

నెలాఖరులోగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన రైతులతో మాట్లాడుతూ రైతులందరూ ఈనెల వరకు మాత్రమే ఈ పంట నమోదు చేస్తారని తెలిపారు. రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అధికంగా యూరియా వాడటం వల్ల నష్టాలను గురించి రైతులకు తెలిపారు. మండలంలో తగినంత యూరియా అందుబాటులో ఉందన్నారు. అధిక వర్షం కారణంగా పొలంలో నీరు నిల్వ ఉన్నట్లయితే అధికమైన నీటిని బయటకు పంపించే ఏర్పాట్లు చేయాలని సూచించారు.

అంగన్‌వాడీ రాజ్యలక్ష్మికి సీఐటియు నివాళి

ప్రజాశక్తి - దుగ్గిరాల



నివాళులర్పిస్తున్న నాయకులు

తుంమ్మపూడి గ్రామానికి చెందిన అంగన్వాడీ టీచర్ మోర్ల రాజ్యలక్ష్మి(46) మంగళవారం మఅతి చెందారు. సిఐటియు నాయకులు బుధవారం ఆమె మఅతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి ప్రాజెక్టు గౌరవ అధ్యక్షుడు వేముల దుర్గారావు, జిల్లా యూనియన్ నాయకులు ఏబీఎన్ కుమారి, దుగ్గిరాల సిఐటియు ఉపాధ్యక్షులు జట్టి బాలరాజు, అంగన్వాడీలు జయ అంజన సామ్రాజ్యం వెంకటేశ్వ రమ్మ సునీత సరస్వతి కళ్యాణి లక్ష్మి స్థానికులు కె.ప్రసాద్, కె.స్టాలిన్, సిహెచ్ ఆంజనేయులు, జి.శ్రీనివాసరావు తదితరులు నివాళులర్పించారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు నందకుమార్

ఏబీ పాలెంలో 'స్వస్థ నారి - సశక్త్ పరివార్ అభియాన్ '

ప్రజాశక్తి - పెదనందిపాడు

స్థానిక పీహెచ్సి పరిధిలోని అబ్బినేనిగుంట పాలెం గ్రామం నందు బ్నుధవారం స్వస్థ నారి -సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కిశోర బాలికలకు ఆరోగ్య పరీక్షలు, క్షయ వ్యాధి స్క్రీనింగ్ , కాన్సర్ స్క్రీనింగ్, చంటి పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు, గర్భిణీ స్త్రీలకు ఆరోగ్య పరీక్షలు, బిపి, షుగర్ స్క్రీనింగ్, మహిళలకు పోషకహారం ,అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కలిగించారు. వైద్యాధికారి డాక్టర్ ఎస్.నందకుమార్, ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. వైద్య సిబ్బంది సిహెచ్ఓ ప్రసాద స్వామి, హెచ్ ఇ షేక్. సుజ, ఎంపీహెచ్ఎస్ పి. అరుంధతి, జి. శ్రీనివాస రావు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన ఇండియాస్ ప్రీమియర్ ఫైనాన్స్ క్విజ్

ప్రజాశక్తి - ఎఎన్‌యు



బహుమతులు పొందిన విద్యార్థులు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జిరోధా వర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండియాస్ ప్రీమియర్ ఫైనాన్స్ క్విజ్ విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమం డాక్టర్ హెచ్.హెచ్. డైక్‌మన్, డాక్టర్ ఎస్. జాన్‌డేవిడ్ ఆడిటోరియంలో బుధవారం జరిగింది. దేశంలోని వివిధ కళాశాలలు, విశ్వవిద్యాలయాల నుంచి 92 జట్లలో 276 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పి.వి.పీ. సిద్ధార్థ కళాశాల ప్రథమ బహుమతి, ఆర్‌విఆర్‌జెసి ఇంజనీరింగ్ కళాశాల ద్వితీయ, విజ్ఞాన్ యూనివర్సిటీ తృతీయ బహుమతులు తెలుచుకున్నాయి.ఆచార్య నాగార్జున యూనివర్సిటీ (యూజీ), ఆచార్య నాగార్జున యూనివర్సిటీ (ఎంబీఏ), విజ్ఞాన్ యూనివర్సిటీ జట్లు ఉత్తమ ప్రదర్శన కనబర్చినందుకు ప్రోత్సాహక బహుమతులు అందుకున్నాయి. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు, గౌరవ అతిథులు హాజరై విద్యార్థులను అభినందించారు. కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ ఫ్యాకల్టీ డీన్ ప్రొఫెసర్ రామినేని శివరామ్ ప్రసాద్ సమన్వయకర్తగా వ్యవహరించగా, కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం నిర్వహణ బాధ్యతలు చేపట్టింది.

రైతుల అంగీకారంతోనే భూ సమీకరణకు వెళ్లాలి



మాట్లాడుతున్న జంజనం కోటేశ్వరరావు

ప్రజాశక్తి - తాడికొండ

రైతుల అంగీకారంతోనే భూ సమీకరణ చేయాలని ఆంధ్ర రాష్ట్ర సమితి వ్యవస్థాపక అధ్యక్షులు జంజనం కోటేశ్వరరావు కోరారు. రాజధాని ప్రాంత ప్రాంత రైతులకు న్యాయం చేయాలని కోరుతూ చేస్తున్న నిరసన దీక్షలు బుధవారం 80వ రోజుకు చేరుకున్నారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ రాజధాని అభివీద్ధి కార్యక్రమంలో భాగంగా రెండవ విడత భూ సమీకరణకు ప్రభుత్వం సిద్ధపడిందని నేటికీ భూ సమీకరణపై స్పష్టత ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం భూ సమీకరణకు వెళితే రైతుకు ఎకరాకు రూపాయలు కోటి చెల్లించాలని, 1250 గజాలు రిటర్న్ బిల్ ప్లాట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రానున్న మున్సిపల్ ఎన్నికలలో ఏ.ఆర్.ఎస్.పార్టీ పోటీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - చేబ్రోలు



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర

అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేయించుకోవడానికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 5 చెక్కులను స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్, జనసేన రాష్ట్ర కార్యదర్శి, ఆంధ్ర ప్రదేశ్ అర్బన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, పొన్నూరు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త వడ్రాణం మార్కండేయ బాబు బుధవారం పంపిణీ చేశారు. చేబ్రోలు మండలం పాతరెడ్డి పాలెం గ్రామానికి చెందిన ఏటుకూరి బాల వినీతకి, నన్నెపాగ అజిత్‌కి, షేక్ జాన్‌బికి, నారాకోడూరు గ్రామానికి చెందిన వెలగా రాజశేఖర్‌కి, మంచాల గ్రామానికి చెందిన చందు పున్నారావుకి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ ఎంతో ఖర్చుతో కూడిన చికిత్స చేయించుకోవటం కోసం ఎమ్మెల్యే నరేంద్ర కుమార్‌ని సహాయం కోసం అడిగిన వెంటనే ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా తమకు ఆర్థిక సహాయం అందజేశారని కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

పత్తి పొలంలో గులాబీ రంగు పురుగులను గమనించండి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి సుగుణ బేగం

పత్తి పంటలో గులాబీ రంగు పురుగులను గమనించాలి మండల వ్యవసాయ శాఖ అధికారి సుగుణ బేగం అన్నారు. బుధవారం ప్రత్తిపాడు, తిక్కిరెడ్డి పాలెం, రూరల్ మండలం బుడంపాడు, గుంటూరు అర్బన్ ప్రాంతంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు షేక్. సుగుణ బేగం, బి.కిషోర్ మాట్లాడుతూ పత్తి పొలాల్లో గులాబీ రంగు పురుగులు గమనించినచో ఎకరానికి 8 నుంచి 10 లింగాకర్షక బుట్టలను ప్రత్తి పొలాల్లో ఏర్పాటు చేసుకోవాలి. ఈ లింగాకర్షక బుట్టలను వారానికి ఒకసారి గమనించుకోవాలని సూచించారు. గులాబీ రంగు పురుగు గుర్తించినచో 5%వేప గింజల కషాయం లేదా వేప నూనె, థయోడికార్బ్, క్వినాల్ ఫాస్ పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఈ.ఓ లు వై. నీలాంబరం, ప్రవీణ్ కుమార్, వి.ఎ.ఎ.కె. లావణ్య, గ్రామ రైతులు పాల్గొన్నారు.

వర్సిటీ రెక్టార్ రత్నషీలామణికి అభినందనలు

ప్రజాశక్తి - ఎఎన్‌యు



ఆచార్య నాగార్జున యూనివర్సిటీ రెక్టార్ ఆచార్య కె.రత్నషిలా మణి రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్‌గా నియామకం కావడం పట్ల పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. నాగార్జున యూనివర్సిటీ విసి కే గంగాధర్ రావు, రిజిస్ట్రార్ జి. సింహాచలం, వర్సిటీ అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు విద్యార్థి సంఘ నేతలు పలువురు ఆమెను కలిసి పుష్పగుచ్చాలను అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.



విశ్వకర్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఎ తమీమ్ అన్సారియా

కలెక్టరేట్‌లో విరాట్ విశ్వకర్మ జయంతి

ప్రజాశక్తి-గుంటూరు

చేతివృత్తుల కళాకారులైన విశ్వకర్మల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతతో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలలో కలెక్టర్ పాల్గొని విరాట్ విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బీసీ సంక్షేమ శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలు ఎక్కువ మందికి లబ్ది అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. చేతి వృత్తి కళాకారులు అవసరమైన నైపుణ్యాల కోసం ప్రభుత్వం రూపొందించిన నైపుణ్యం వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకుంటే వారికి పూర్తిస్థాయిలో నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వడంతో పాటు మంచి ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీ విశ్వబ్రాహ్మణ సంఘం సమన్వయ కమిటీ చైర్మన్ ఎం.వెంకటప్రసాద్, గుంటూరు టిడిపి బీసీ సెల్ అధ్యక్షులు వేములకొండ శ్రీనివాస్, గుంటూరు పార్లమెంటరీ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు జంపని నాగేశ్వరరావు, డిఆర్ఒ ఖాజావలి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి మయూరి తదితరులు పాల్గొన్నారు.



వివిధ దేశాల ప్రతినిధులతో డాక్టర్ విజయ

ముందస్తు అవగాహనతోనే స్ట్రోక్ నివారణ

ఐఎస్ఎ ప్రెసిడెంట్ డాక్టర్ విజయ

ప్రజాశక్తి-గుంటూరు

జపాన్‌లోని హ్యోగో మెడికల్ యూనివర్సిటీ, కోబె క్యాంపస్‌లో సెప్టెంబర్ 12 నుండి 15 వరకూ జరిగిన అంతర్జాతీయ ఆసియా పసిఫిక్ స్ట్రోక్ కాన్ఫరెన్స్‌లో భారత దేశం నుండి ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ పి.విజయ పాల్గొన్నారు. ఈ సమావేశంలో సభ్య దేశాలతో సహకార రౌండ్ టేబుల్ ప్లాట్‌ఫామ్‌కు ఆమె నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఐఎస్ఎ ప్రెసిడెంట్‌గా డాక్టర్ విజయ తలపెట్టిన 'బ్రెయిన్ స్ట్రోక్ – టైమ్ టూ యాక్ట్' అవగాహన కార్యక్రమాన్ని, అలాగే వైద్యులు, పారామెడికల్ సిబ్బందికి అందిస్తున్న ప్రత్యేక శిక్షణ మాడ్యూల్స్‌ను పరిచయం చేశారు. డాక్టర్ పి. విజయ, యువకులు, పిల్లలలో బ్రెయిన్ స్ట్రోక్‌కు కారణమయ్యే 'వాస్కులైటిస్, రోగనిరోధక సంబంధిత స్ట్రోక్‌లు' అనే అంశంపై మాట్లాడారు. ఈ పరిస్థితులు సంక్లిష్టమైనవని,తరచుగా నిర్ధారణ చేయబడవని, ముందుగానే గుర్తించబడకపోతే ఫలితాలను గణనీయంగా ప్రభావితం చేస్తాయని చెప్పారు. వీటి గురించి అవగాహన పెంచడం ద్వారా, ముందుగా గుర్తించి చికిత్స అందించగలిగితే, మెరుగైన రికవరీ, దీర్ఘకాలిక సమస్యలు తగ్గించవచ్చని ఆమె సూచించారు. అదేవిధంగా మహిళల్లో పక్షవాతంకు కారణమయ్యే రిస్కు ఫాక్టర్స్, చికిత్సలను వివరించారు. చిన్ననాటి నుంచి మెనోపాజ్ వరకు మహిళలు ఎదుర్కొనే సమస్యల వల్ల పక్షవాత ప్రమాదం ఎక్కువగా ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ప్రతి 5 గురు మహిళల్లో ఒకరు పక్షవాతంకు గురవుతారని, పక్షవాతం వల్ల మరణాలు రొమ్ము క్యాన్సర్ కంటే రెండింతలు ఎక్కువగా ఉంటున్నాయని వెల్లడించారు. ముందస్తు రుతుక్రమం, పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్, గర్భధారణకు సంబంధించిన సమస్యలు, ఎండోమెట్రియోసిస్, మెనోపాజ్ వంటి పరిస్థితులు స్ట్రోక్ ప్రమాదాన్ని పెంచుతాయని ఆమె తెలిపారు. అవగాహనతో మహిళల్లో స్ట్రోక్‌ను ముందుగానే గుర్తించి, చికిత్స అందించి, ఆరోగ్యాన్ని కాపాడేందుకు పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. ఆసియాలోని అనేక దేశాల ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

ప్రొఫెసర్ అమృతవల్లికి జీవిత సాఫల్య పురస్కారం

కాశ్మీర్ యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ సైన్సెస్ టెక్నాలజీలో ప్రదానం

ప్రజాశక్తి - ఎఎన్‌యు



భారతదేశ విజ్ఞాన వేదిక పై ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఆచార్యులకు అరుదైన గౌరవం లభించింది. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని వక్షశాస్త్రం, సూక్ష్మజీవ శాస్త్ర విభాగంలో ఆచార్యులుగా సేవలు అందిస్తూ విస్తత పరిశోధనలు చేస్తున్న ఆచార్య అడిపూడి అమతవల్లికి జీవిత సాఫల్య పురస్కారం లభించింది. ఏషియన్ పీజీపీఆర్ సొసైటీ భారతీయ శాఖ ఆధ్వర్యంలో జమ్మూలో జరిగిన జాతీయ సదస్సుకు ఆచార్య ఎ అమతవల్లి అధ్యక్షత వహించారు. దశాబ్ద కాలంకు పైగా పీజీపీ ఆర్ అధ్యక్షురాలిగా ఆమె చేస్తున్న సేవలకు ,మూడు దశాబ్దాలకు పైగా అధ్యాపకురాలిగా పరిశోధకురాలుగా ఆమె చేస్తున్న సేవలకు గానూ ఈ పురస్కారం లభించింది. ఈ పురస్కారాన్ని షేర్ ఈ కాశ్మీర్ యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ టెక్నాలజీ ఆఫ్ జమ్మూ ఉపకులపతి బి ఎన్ త్రిపాఠి, ఘజియాబాద్ లోని అకాడమీ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇన్నోవేషన్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ మనోజ్ కుమార్ ధార్, అమెరికా ఏషియన్ పీజీ పీ ఆర్ సొసైటీ చైర్మన్ ఆచార్య ఎమ్ ఎస్ రెడ్డి, జమ్మూ సి ఎస్ ఐ ఆర్ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంటిగ్రేటివ్ మెడిసిన్ డైరెక్టర్ డాక్టర్ జబీర్ అహ్మద్, ఎస్ కె యు ఎ ఎస్ టి పరిశోధక విభాగ డైరెక్టర్ డాక్టర్ ఎస్ కె గుప్తా ఆచార్య ఎ అమృతవల్లి కి అందించారు. ఈ సందర్భంగా ఆమె సేవలను కొనియాడారు. జమ్మూలోని షేర్ ఈ కాశ్మీర్ యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ టెక్నాలజీ లో గత మూడు రోజులుగా సదస్సు నిర్వహించారు. పుడమి– పంటల సంరక్షణే ధ్యేయంగా భారత దేశ వ్యాప్తంగా ఉన్న పరిశోధకులు విజ్ఞాన వేత్తలు ఈ సదస్సులో పాల్గొన్నారు. ఆచార్య అమతవల్లి కి ఉత్తమ ఆచార్యులుగా పరిపాలక సేవకురాలిగా జీవిత సాఫల్య పురస్కారం లభించడంతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం లోని ఆచార్యులు వివిధ విభాగాల అధ్యాపకులు పలువురు పరిశోధకులు ఆమెకు అభినందనలు తెలిపారు.

ఆర్‌విఆర్ జెసిలో బ్యాంకింగ్ సేవలపై వర్క్‌షాప్

ప్రజాశక్తి-గుంటూరు

కృత్రిమ మేధ ఆధారిత బ్యాంకింగ్ సేవలు భవిష్యత్‌లో విశ్వసనీయత, పారదర్శకతను పెంపొందించి, ఆర్థిక రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురానున్నాయని హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు సీనియర్ వైస్ చైర్మన్ టివిఎస్.రావు అన్నారు. ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజీలో ఎంబిఎ విద్యార్థులకు 'ది ఫ్యూచర్ ఆఫ్ ఇండియన్ బ్యాంకింగ్ ఫిన్టెక్స్, ఎన్‌బిఎఫ్‌సిలు, ఎఐ ఇన్ ఆన్ ఎంటర్‌ప్రెన్యూరియల్ ఎరా' అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో టివిఎస్.రావు మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో బ్యాంకింగ్ రంగంలో నిర్వహిస్తున్న కార్యకలాపాలు, భవిష్యత్‌లో ఏఐ సాంకేతిక పరిజ్ఞానంతో చోటు చేసుకోనున్న పరిణామాల గురించి వివరించారు. డిజిటల్ యుగంలో సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో ఆర్థిక లావాదేవీలు మరింత సులభంగా, సమర్థవంతంగా నిర్వహించబడుతున్నాయని చెప్పారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు చిన్న వ్యాపారులకు కీలక మద్దతు అందిస్తున్నాయని చెప్పారు. బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు విశేష అవకాశాలు ఉన్నాయని కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ అన్నారు. కార్యక్రమంలో సెక్రెటరీ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టివిఎస్.రావు

కిట్స్ కళాశాలలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్

ప్రజాశక్తి-గుంటూరు

కిట్స్ ఇంజినీరింగ్ కాలేజిలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్–అంతర్గత హ్యాకథాన్ నిర్వహించారు. కార్యక్రమంలో 165 జట్లు ఉత్సాహంగా పాల్గొని, వివిధ రంగాలలోని 18 థీమ్‌లు, 135 సమస్యా ప్రకటనలపై తమ ప్రతిభను ప్రదర్శించాయి. విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే విధంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సృజనాత్మక ఆలోచనలతో కొత్త పరిష్కారాలను ప్రతిపాదించారు. ఐటీ, వ్యవసాయం, ఆరోగ్యం, స్మార్ట్ సిటీలు, విద్య, పర్యావరణ పరిరక్షణ, భద్రతా వ్యవస్థలు, శక్తి వనరుల వినియోగం, రవాణా, గ్రామీణ అభివృద్ధి వంటి అనేక కీలక రంగాల్లో విద్యార్థులు విభిన్న కాన్సెప్ట్‌పై పనిచేశారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ సాంకేతికతలో ఆవిష్కరణల ప్రాముఖ్యతను, అందులో విద్యార్థుల పాత్రను వివరించారు.కళాశాల కార్యదర్శి కోయి శేఖర్ మాట్లాడుతూ ఈ హ్యాకథాన్ విద్యార్థులకు కేవలం సాంకేతిక ప్రతిభను మాత్రమే కాకుండా జట్టు పనితీరును, సమస్య పరిష్కార నైపుణ్యాలను, కొత్త ఆలోచనలతో ముందుకు సాగే ధైర్యాన్ని నేర్పుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, డైరెక్టర్ కె.హరిబాబు, స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్ అరుణ ప్రసంగించారు.



మాట్లాడుతున్న కిట్స్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు

హిందూ ఫార్మసీలో ఫార్మకో విజిలెన్స్ వారోత్సవాలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో 5వ జాతీయ ఫార్మకో విజిలెన్స్ వారోత్సవాలు బుధవారం ప్రారంభం అయ్యాయి. కార్యక్రమంలో ప్రభుత్వ జ్వరాల ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.రఘు మాట్లాడుతూ నూతన ఔషధాల మార్కెటింగ్‌కు అనుమతించే ముందు వాటిపై వివిద ఔషధ సంస్థలు నిర్వహించే ఫేజ్ 1, ఫేజ్ 2, ఫేజ్ 3 క్లినికల్ ట్రయల్స్, వాటి ప్రాముఖ్యతను గురించి విద్యార్థులకు తెలియజేశారు. క్లినికల్ ట్రయల్స్‌లో కొంతమంది స్వచ్ఛంద సేవకులపై పరీక్షల ఫలితాలపై ఆధారపడి మార్కెటింగ్‌కు అనుమతి ఇస్తారని అన్నారు. ఆ తర్వాత ఎక్కువ మంది రోగులకు వాడినప్పుడు కలిగే అవాంఛనీయ దుష్ప్రభావాలను తెలుసుకొని, వాటి నివారణకు ఫార్మకో విజిలెన్స్ ఆఫ్ ఇండియా సహాయ పడుతుందని చెప్పారు. ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ డి.బ్రహ్మ శ్రీనివాసరావు మాట్లాడుతూ పివిపిఐ శాఖ భారతీయ ఔషధ నియంత్రణ సంస్థ శాఖని వివిధ పివిపిఐ కేంద్రాల నుంచి సేకరించిన సమాచారాన్ని విశ్లేషించి, ఔషధాల దుష్ప్రభావాల నియంత్రణకు తగిన చర్యలు తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో కళాశాల కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.హేమకుమారి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం, చైర్మన్ జూపూడి రంగరాజు, సెక్రెటరీ డాక్టర్ ఎస్.మధుసూదనరావు, డైరెక్టర్ పి.సీతారామయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ రఘు, తదితరులు

ప్రగతి నగర్ వద్ద ఆర్టీసీ స్టాప్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

మహాత్మా గాంధీ ఇన్నర్ రింగ్ రోడ్డు, ఫేజ్ 1లోని ప్రగతి నగర్ వద్ద ఆర్టీసి రిక్వెస్ట్ స్టాప్ ఇవ్వాలని ఐద్వా, సిఐటియు నాయకులు ఆర్టీసి అధికారుల్ని కోరారు. బుధవారం ఆర్టీసి అధికారులకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రగతి నగర్, మదర్ థెరిస్సా కాలనీ, రాయపాటి శ్రీనివాస్ కాలనీ, హేమనీ నగర్, ఆసన్నకుంటలలో 500 కుటుంబాలు నివసిస్తున్నారన్నారు. వీరు ప్రతిరోజు పనుల కోసం, ఇతర అవసరాల రీత్యా నగరంలోకి ఆటోలలో ప్రయాణిస్తున్నారని దీనివలన చార్జీలు అధికమవుతున్నాయన్నారు. శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టడం వలన అమరావతి రోడ్డు వైపు నుంచి వచ్చే బస్సులు చిల్లీస్ నుండి ఇన్నర్ రింగ్‌రోడ్‌లో నుండి బస్టాండ్‌కు వస్తున్నాయని, అదే దారిలో ప్రగతి నగర్ వద్ద రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఐద్వా నగర అధ్యక్షులు జి. రమణ , సిఐటియు నాయకులు కె.శ్రీనివాసరావు, ఫాతిమా, ఓబులేశ్వరి, నాగలక్ష్మి, సుభాషిణి, రాగి కుమారి, పాములు, అమ్ములు, నరసమ్మ, మల్లేశ్వరి కృష్ణవేణి తదితరులున్నారు.



వినతిపత్రం ఇస్తున్న నాయకులు